
కరీంనగర్ వార్త
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల
గురువారం 23, జులై 2026 16 పేజీలు


16వ పేజీలో...

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

**ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేద్దాం : కలెక్టర్ చిత్రా మిశ్రా...**

కరీంనగర్ కలెక్టరేట్ , ప్రభాతవార్త: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని.. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా శాఖల




2 లో..

# కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

**విద్యార్థుల జీవితాలతో చెలగాటమా**

**నీట్ యూజీ పేపర్ లింక్ తో మోడీ ప్రభుత్వానికి మూడింది**

**విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ హోం మంత్రి పదవి నుంచి తప్పుకోవాలి**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త

కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలనిప్రతి ఏటా నిర్వహించే నీట్ యూజీ పరీక్ష పత్రం లీకేజీతో కేంద్రంలో ని మోడీ ప్రభుత్వానికి మూడిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దేశ వ్యాప్తంగా ప్రతి యేటా నిర్వహించే నిట్ పరీక్ష కు సుమారుగా20 లక్షలకు పైగా మందికి పైగా విద్యార్థులు హాజరు అవుతారని తెలిపారు. ఈఏడాది నీట్ యూజీ పరీక్షలకు 22 లక్షల, 79వేల 743మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావడానికి రిజిస్టేషన్ చేసుకున్నారని,19 లక్షల 99వేల,895 మంది విద్యార్థులు విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారని తెలిపారు.తెలంగాణ రాష్ర్టం నుంచి 73,084 మంది విద్యార్థులు హాజరు అయ్యారని పరీక్ష పత్రం లీకేజీ వలన ఇప్పటి వరకు 12మంది విద్యార్థులు



ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.లక్షల మంది విద్యార్థుల భవిష్యత్.. వారి తల్లిదండ్రుల కళలను సహకారం చేసుకునే ఈపరీక్షను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్రం ప్రభుత్వంపై ఉందని కాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షను పారదర్శకంగా నిర్వహించానికి ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరీక్ష ప్రశ్న పత్రాలు పల్లి, బాఠాణీ అమ్మినట్లు ప్రశ్న పత్రాలను అమ్ముకున్నారని మంత్రి అడ్లూరి అన్నారు.సోషల్ మీడియా మరియు టెలిగ్రామ్ ద్వారా లీక్ అయిన ప్రశ్నలు పిడిఎఫ్ రూపంలో టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు విక్రయించినట్లు

## లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లో చెత్త బర్త్ కంట్రోల్ రచ్చ

**చెత్త నిల్వలు, కుక్కల అరుపులతో నిద్రలేని రాత్రులు గడుపుతున్న 7వ వార్డు ప్రజలు**

**"వార్త "కథనానికి స్పందించిన బిజెపి ఫ్లోర్ లీడర్**

**కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన కౌన్సిలర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్...**

**తరలించకపోతే తీవ్ర ఉద్యమం చేస్తామని హెచ్చరిక**



ప్రభాతవార్త, మెట్ పల్లి డివిజన్

మెట్‌పల్లి పురపాలక సంఘం పరిధిలోని సర్వే నెంబర్ 823లో తీవ్ర ప్రజారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నాటి గ్రామపంచాయతీ నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్ అనుమతి కోసం ప్రజోపయోగం కింద కేటాయించిన స్థలాన్ని, నేడు మున్సిపల్ అధికారులు దుర్వినియోగం చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో సర్వే నెంబర్ 823 లోని 14,734 గజాల స్థలంలో బీర్యాకర్ కాశిరామ్, బీర్యాకర్ చంద్రయ్యలు 1985లో 71 ప్లాట్లతో కూడిన లేఅవుట్‌ను ఏర్పాటు చేసి విక్రయించారు. అప్పట్లో గ్రామపంచాయతీ మెట్‌పల్లి సూచనలు, నిబంధనలకు కట్టుబడి లేఅవుట్ అప్రూవల్ పొందారు. దీనిలో భాగంగా రహదారుల

16వ పేజీలో...


16వ పేజీలో...

## సుప్రీం కోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలి

**రోడ్డు భద్రత చర్యలు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేసి, అవసరమైన అన్ని చర్యలను 60 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్ పర్సన్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సుప్రీంకోర్టు

## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

మొదటి పేజీ తరువాయి..



కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఆధారాలు సేకరించిందని మంత్రి అడ్లూరి అన్నారు. నీట్ యూజీ ప్రశ్నపత్రాల రూపకల్పన, అనువాద ప్రక్రియ మరియు పరీక్షా ప్యానెల్‌లోని సబ్జెక్ట్ నిపుణులు/కోచింగ్ నిర్వాహకులు ఈ లీకేజీలో కీలక పాత్ర పోషించినట్లు బీజేపీ జేబు సంస్థగా చెప్పుకునే సీబీఐ దర్యాప్తులో తేల్చిందనిఢిల్లీ, జైపూర్, పుణే, లాతూర్, గురుగ్రామ్ తదితర ప్రాంతాల్లో లెక్చరర్లు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు మరియు దళారులను సీబీఐ అరెస్ట్ చేసింది నిజం కదా అని మంత్రి ప్రశ్నించారు. సీబీఐ దర్యాప్తులో పరీక్ష పత్రం లీక్ అయినట్లు తెలిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిరక్ష ్యంతో నీట్, యూజీ పరీక్ష పత్రం లీక్ కావడంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ యూజీ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత ఎందుకు రాజీనామా చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. ప్రశ్న పత్రం లీకేజీపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేపడితే కేంద్రంలోని మోడీ సర్కార్ విద్యార్థులపై లాఠీలు విరగకొడుతుందని నీట్ యూజీ పరీక్ష పత్రాల లీకేజీ పై పార్లమెంటులో చర్చ జరగాలని కాంగ్రెస్ మిత్ర పక్షాలు పట్టు పట్టినప్పటికీ ఎందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం లేదని మంత్రి ప్రశ్నించారు. గడిచిన రెండు రోజులుగా పార్లమెంట్ ను వాయిదా వేశారు తప్ప కేంద్ర ప్రభుత్వం చర్చకు మాత్రం అంగీకరించడం లేదని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఆధారాలు చూపించి అరెస్టులు చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయడం లేదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేసిన ధర్నా సందర్భంగా ఢిల్లీ పోలీసులు కేంద్ర ప్రభుత్వం లాఠీ చార్జి చేయడానికి బాధ్యత వహిస్తూ ప్రధానం ప్రధానమంత్రి మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ధర్నా నిర్వహించిందనిప్రజాస్వామ్యబద్ధంగా ప్రధానమంత్రి ఇంటి ముందు ధర్నా చేస్తున్న ప్రతిపక్షాలపై ప్రభుత్వం దాడులు చేయడంతో రాహుల్ గాంధీ గాయపడ్డారని మంత్రి తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గలమెత్తుతున్న రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కావాలని దాడి చేసింది. సంవత్సరాల తరబడి కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవస్థ నాశనం చేస్తోంది. ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల కడుపుకోత ఏలా తీరేది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పెద్దలు చెప్పాలని అన్నారు. డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య మాట్లాడుతూఎన్టీఏ పరీక్ష విధానాల్లో పారదర్శకత తెచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి పార్లమెంటులో పరీక్ష పత్రాల లీకేజీపై చర్చకు కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని డిమాండ్ చేస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లో చెత్త బర్త్ కంట్రోల్ రచ్చ...

మొదటి పేజీ తరువాయి..



విస్తరణకు 4,403.55 గజాల స్థలాన్ని కేటాయించగా, ప్రజా సంక్షేమం మరియు లేఅవుట్ ఓపెన్ స్పేస్ అవసరాల కోసం ప్లాట్ నంబర్లు 46, 47, 48, 49 ల పరిధిలోని 929 చదరపు గజాల స్థలాన్ని గ్రామపంచాయతీ ప్రజల ఉపయోగం కోసం కేటాయించారు. 2004 నాటికి మెట్‌పల్లి గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా రూపాంతరం చెంది పట్టణంగా రూపుదిద్దుకుంది. అయితే కాలనీవాసుల శారీరక, మానసిక వికాసానికి, విశ్రాంతికి పార్కుగా లేదా ఓపెన్ జిమ్‌గా అభివృద్ధి చేయాల్సిన ఈ 929 గజాల స్థలంలో మున్సిపల్ యంత్రాంగం నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంది. ఆ స్థలంలో వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేసే నిమిత్తం యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన ఖాళీ ప్రదేశాన్ని చెత్త సేకరణకు, నిల్వకు వినియోగిస్తున్నారు. పట్టణవ్యాప్తంగా సేకరించిన వ్యర్థాలను ఇక్కడ వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధభరితంగా మారింది. ఈ చర్యల కారణంగా కాలనీ సమీపంలో నివసించే ప్రజలు, రాకపోకలు సాగించే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్సలు చేసిన కుక్కల నిరంతర భయానక అరుపులతో వార్డు ప్రజలకు రాత్రివేళల్లో ప్రశాంతమైన నిద్ర కరువవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో రోడ్లపై నడవలేని పరిస్థితులు దాపురించాయని, దోమలు, ఈగల వ్యాప్తి పెరిగి చిన్న పిల్లలు, వయోవృద్ధులు తరచూ రోగాల బారిన పడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. మోడల్ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటయ్యేవరకు పోరాడుతాం బిజెపి ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్ఈ సమస్యపై మెట్‌పల్లి మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్ వార్డు ప్రజల తరఫున స్పందించి మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. లేఅవుట్ ఓపెన్ స్పేస్ ఉద్దేశాన్ని నీరుగారుస్తూ ఏర్పాటు చేసిన ఈ యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ మరియు చెత్త డంపింగ్ యార్డ్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వార్డు ప్రజలను సమీకరించి మున్సిపల్ యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ స్థలాన్ని మోడల్ పార్కుగా లేదా ఓపెన్ జిమ్‌గా అభివృద్ధి చేసి కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని ఆమె అధికారులకు, పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్**

**రైతులు ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకొని సహకరించాలి**

**జులై 15 నుంచి ఫ్రైట్ లారీ (ఎఫ్ ఓ ఎల్) సౌకర్యం నిలిపివేత**

**మార్క్ ఫెడ్ సరఫరా చేసే ఎరువులకు మాత్రమే రవాణా చార్జీలు వసూలు చేయాలి**

ప్రభాతవార్త కలెక్టరేట్ జూలై 22

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మేరకు ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 2026 జూలై 15 నుంచి మార్కెట్ ద్వారా ఇప్పటివరకు అమల్లో ఉన్న ఫ్రైట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్ ) సౌకర్యాన్ని నిలిపి వేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మార్క్ ఫెడ్ గిడ్డంగులు (ఎక్స్ వేర్ హౌస్ ) లేదా రేక్ హెడ్ లా (ఎక్స్ రేఖ హెడ్ ) నుంచి సరఫరా ఎరువులకు సంబంధించిన రవాణా చార్జీలు మాత్రమే రైతుల నుంచి నిర్ణయించిన రేట్ల ప్రకారం వసూలు చేయాలని సూచించారు. మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ నిర్ణయించిన రవాణా చార్జీల జాబితాకు అనుగుణంగానే వసూళ్లు చేపట్టాలని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) ఆర్థిక నష్టం కలగ కుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తుందని కలెక్టర్ తెలియజేశారు. ఎరువుల విక్రయానికి, రవాణా చార్జీల వస్తువులకు వేరు, వేరు రసీదు పుస్తకాలు నిర్వహించాలని, రైతుల సంతకాలతో ప్రత్యేక రసీదులు తప్పనిసరిగా జారీ చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు.



## గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో ఖమ్మం అభివృద్ధి

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పూర్తయితే ఖమ్మం జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని, ఆగస్టు 1 నుంచి ఖమ్మం, వైరా, సత్తుపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి దంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి అసలు ప్రణాళికలో దంసలాపురం వద్ద ఎగ్జిట్ లేకపోయినా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దంసలాపురం, కల్లూరు, సత్తుపల్లి వద్ద ప్రత్యేక ఎగ్జిట్లు తీసుకొచ్చామని తెలిపారు. దంసలాపురం ఎగ్జిట్ రైల్వే వంతెన ఆధారంగా నిర్మించబడిందన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ రహదారిపై వాహనాల రాకపోకలు ప్రారంభమైతే ఖమ్మం, వైరా, సత్తుపల్లి ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి వైపు వెళ్లే దాదాపు 90 శాతం వాహనాలు ఈ జాతీయ రహదారినే వినియోగిస్తాయని తెలిపారు. ప్రజలకు ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భవిష్యత్తులో పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలకు పెద్ద ఎత్తున దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ రహదారి ద్వారా రాజమండ్రికి కేవలం రెండు గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే కావడంతో జంతువులు, ఆటోలు, అనధికార క్రాసింగ్‌లు వంటి అంతరాయాలు లేకుండా సురక్షి త ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. అమరావతి నుంచి భద్రాచలం మీదుగా జగదల్‌పూర్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి ప్రతిపాదన ఉందని తెలిపారు. మణుగూరు నుంచి ఏటూరునాగారం మీదుగా నాగపూర్ వెళ్లే జాతీయ రహదారి కూడా రానుందని చెప్పారు. కరీంనగర్– వరంగల్ నుంచి అమరావతికి వెళ్లే రహదారి పనులు కొనసాగుతున్నాయని, భూసేకరణ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఆలస్యం జరుగుతోం దన్నా రు. ఖమ్మం–అశ్వారావుపేట రహదారిని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కి అప్పగించామని, నాలుగు లైన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని, వెంటనే డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం ప్రవేశం నుంచి అశ్వారావుపేట వరకు ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం మార్కింగ్ పూర్తి చేసి రహదారి పక్కన ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. తాను మంత్రి అయినప్పుడు ఖమ్మం జిల్లాలో ఒక్క సెంటీమీటర్ జాతీయ రహదారి కూడా లేదని, ప్రస్తుతం అన్ని దిశల్లో జాతీయ రహదారులు అభివృద్ధి చెందడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. సమన్వయంతో అమరావతి రహదారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి జిల్లా పరిధిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కామాంచికల్ మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డును పొన్నెకల్ నుంచి అమరావతి రహదారికి రూ.120 కోట్లతో అనుసంధానం చేస్తున్నామని, ఆ రహదారి పూర్తయితే ఇల్లెందు, వైరా ప్రాంతాల ప్రజలు ఖమ్మం నగరంలోకి రాకుండానే తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతీయ రహదారుల అనుసంధానంతో ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్ తరహా వ్యవస్థ ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా నిధుల కొరతతో సాధ్యం కాలేదని, ఇప్పుడు జాతీయ రహదారుల ద్వారానే ఆ లక్ష ్యం నెరవేరిందన్నారు. ఈ జాతీయ రహదారి ప్రారంభంతో ఖమ్మం నగరం ట్రాఫిక్ రహితంగా మారుతుందని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ విలువైన భూములను అందించిన రైతులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సహకారం వల్లే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వేగంగా పూర్తి దశకు చేరుకుందని, జిల్లా అభివృద్ధిలో రైతుల సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట రోడ్ల విస్తరణ చేపట్టి ఫుట్‌పాత్‌లు నిర్మించాలని, ఫుట్ పాత్‌లపై ఎలాంటి ఆక్రమణలు అనుమతించవద్దన్నారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న వీధి వ్యాపారులకు పునరావాసం కల్పించిన తర్వాత మాత్రమే తొలగించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలను తొలగించిన అనంతరం రోడ్ల విస్తరణ చేపట్టాలని, నగరంలో ప్రణాళికాబద్ధంగా పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు**

**రాజకీయ పార్టీల సహకారంతో అర్హులందరి నమోదు పూర్తి చేయాలి**



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, జూలై 22:**

109ములుగు ఎస్టీ శాసనసభ నియోజకవర్గ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల సహకారంతో ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు నమోదు చేసి, ఎవరూ జాబితాకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 25 నుంచి బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తున్నారని, జిల్లాలో ఇప్పటికే 83.03 శాతం ఫారాల డిజిటైజేషన్ పూర్తైందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ ఫారాలపై ప్రత్యేక దృష్టి. ప్రతి బూత్ పరిధిలో మిగిలి ఉన్న ఓటర్లను మరోసారి సంప్రదించి పెండింగ్‌లో ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి, డిజిటైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేసి, అవసరమైతే రీవిజిట్ నిర్వహించి ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా మిగిలిపోకుండా చూడాలని సూచించారు. బీఎల్‌ఓ యాప్‌లో ఖచ్చితమైన నమోదు. బీఎల్ఓ యాప్ ద్వారా ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, డిజిటైజ్ చేసిన ఫారాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆగస్టు 10 నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు. ఆగస్టు 10 నుంచి ప్రారంభమయ్యే క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఓటర్ల పేర్ల చేర్పు, సవరణలు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని స్పష్టం చేశారు. మరణించిన లేదా ఇతర కారణాలతో పేరు తొలగించాల్సిన సందర్భాల్లో కూడా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, డీడబ్ల్యూఓ ప్రేమలత, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల సిబ్బంది సలీం, నితీష్, రమాదేవితో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరుగు స్థలంనెమ్మదిగా వెళ్ళండి

**సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన వెంకటాపూర్ పోలీసులు**

వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త ;;




మండలంలో ఇటీవల జరుగుతున్నటువంటి రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు తెలిపారు. జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు ములుగు డి.ఎస్.పి రవీందర్ పర్యవేక్షణలో బుధవారం వెంకటాపూర్ మండలంలోని తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నటువంటి ప్రదేశాలను(బ్లాక్ స్పాట్ )గుర్తించి అట్టి ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి ప్రధాన మూల మలుపుల వద్ద భారీ ఫ్లెక్సీలను సూచికలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండలం మీదుగా ప్రయాణిస్తున్నటువంటి వాహనదారులకు వాహనాన్ని నడిపే ముందు రోడ్డు నియమ నిబంధనలు అన్నింటినీ పాటించవలసిందిగా ఎస్సై కోరుతూ హెచ్చరించారు. ములుగు సీఐ దారం సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన ఆరోగ్య సేవలకు ములుగులో అత్యాధునిక కేంద్రం

**ఎయిమ్స్-ట్రైబల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ప్రతిపాదన**



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, జూలై 22:**

గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ములుగు జిల్లాలో అత్యాధునిక "సెంటర్ ఫర్ ట్రైబల్ హెల్త్ అండ్ అకడమిక్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్, సమ్మక్క-సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్త భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చలు జరిగాయని వెల్లడించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో బీబీనగర్ ఎయిమ్స్ డీన్ (రిసెర్చ్) డా. రాహుల్ నరాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రతిపాదిత కేంద్రం ఏర్పాటుపై చర్చించింది. గిరిజన ఆరోగ్య సేవల బలోపేతం, వైద్య పరిశోధనలు, అకడమిక్ సహకారం, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గిరిజన వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలుప్రతిపాదిత కేంద్రం ద్వారా తలసీమియా, రక్తహీనత, సికిల్ సెల్ అనీమియా, మలేరియా, డెంగ్యూ, క్షయవ్యాధి, స్క్రబ్ టైఫస్, జూనోటిక్ వ్యాధులు వంటి గిరిజన ప్రాంతాల్లో అధికంగా కనిపించే వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలు నిర్వహించడంతో పాటు టెలిమెడిసిన్ సేవలను విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థను మెరుగుపరచడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తరించడంపైనా దృష్టి సారించినట్లు చెప్పారు. ఆరోగ్య విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యంగిరిజన యువతకు ఆరోగ్య విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కల్పించడం, ఎయిమ్స్ బీబీనగర్-సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య సేవలు, అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధనలను విస్తరించే కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ములుగు జిల్లాను గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలు, ప్రజారోగ్య అధ్యయనాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. గోపాలరావు, ములుగు ఏరియా ఆసుపత్రి, ఏటూరునాగారం ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డా. చంద్రశేఖర్, డా. సురేష్, ఎయిమ్స్ వైద్య బృందం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చల్వాయిలో డీసీసీబీ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ క్యాంప్

**రైతులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన**

గోవిందరావుపేట ప్రభాతవార్త

మండలంలోని చల్వాయి గ్రామ రైతు వేదికలో బుధవారం డీసీసీబీ బ్యాంకు ములుగు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ క్యాంప్ నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ మరియు సూపర్వైజర్ పాల్గొని రైతులకు బ్యాంకు అందించే వివిధ రకాల సేవలను, రుణ సౌకర్యాలను, డిజిటల్ బ్యాంకింగ్, పొదుపు పథకాల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి చల్వాయి గ్రామ సర్పంచ్ మేకల రాధా సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల ఆర్థిక ప్రగతికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా పిఏ ఎస్ ఎస్ గోవిందరావుపేట సీఈఓ , సంఘ సిబ్బంది, పి ఎస్ ఎస్ డైరెక్టర్ సదానందం , మిత్ర డైరెక్టర్ కె. నర్సయ్య మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# ఆదివాసి సంఘాల సమావేశం

**జాతీయ ఆదివాసి దినోత్సవం భారీగా నిర్వహించుటకు సన్నాహాలు**

ప్రభాతవార్త వాజేడు



మండలంలోని అన్ని ఆదివాసి సంఘాలు బుధవారం సమావేశమయ్యారు. వాజేడు మండల కేంద్రంలో ఆదివాసి సంఘాల సంఘాల నాయకులు సమావేశమై రాబోవు ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవం భారీగా నిర్వహించాలని దానికి అన్ని సంఘాలు సహకరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఆదివాసీల అభిప్రాయ సేకరణ మరియు ఆదివాసి చట్టాల అమలుపైన చర్చించి భవిష్యత్తులో అన్ని సంఘాలు ఏకమై ఆదివాసి గ్రామాలలో ప్రజలకి చట్టాల పైన అవగాహన కల్పించాలని ప్రతి గ్రామపంచాయతీ లో గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు, మొబైజర్స్ , గ్రామ యువకులు, ఆదివాసి మహిళలు తదితరులు పాల్గొన్నాని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు పాయం జానకి రమణ, ఆదివాసి నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, ములుగు జిల్లా ఆదివాసి విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోదెబోయిన సురేష్, తుడుం దెబ్బ నాయకులు లక్ష్మణ్, గోండ్వానా విద్యార్థి అధ్యక్షులు పద్దం సుధాకర్, పెసా మండల అధ్యక్షులు ఇండ్ల సమ్మయ్య, సీనియర్ నాయకులు యాలం సుబ్బయ్య, యువకులు క్నోర మనోజ్ కుమార్ తల్లడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

## పడిపోయిన 9,700 రూపాయల ను, యజమానికి అప్పగించిన పసర ఎస్. ఐ.

**పోలీసు అంటే మానవత్వమే అని చాటిన తాజుద్దీన్"**

గోవిందరావుపేట ప్రభాతవార్త



పసరపోలీస్ స్టేషన్ సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. తాడ్వాయి మండలం కొత్తూరుకు చెందిన సోయం వీరబాబు గోవిందరావుపేట వెళ్తుండగా బండి నుండి పడిపోయారు. తలకు దెబ్బలు తగిలి ఆయనను అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. ఆ తొందరలో ఆయన వద్ద ఉన్న ..9,700/ నగదు రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో విధుల్లో ఉన్న ఎస్. ఐ. తాజుద్దీన్, కానిస్టేబుల్ మధుకర్ ఆ నగదును గమనించారు. ఏమాత్రం ఆశించకుండా ఆ నగదును వెంటనే భద్రపరిచారు. వెంటనే విచారణ చేపట్టి, ఆధారాలతో అది వీరబాబుదేనని నిర్ధారించారు. బుధవారంపసర ఎస్ ఐ తాజుద్దీన్ సమక్షంలో మొత్తం ..9,700/ ను బాధితుడికి అప్పగించారు. పోగొట్టుకున్న సొమ్ము తిరిగి రావడంతో వీరబాబు ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనతో పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత పెరిగిందని స్థానికులు కొనియాడారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక అరెస్టులకు నిరసనగా భారీ ర్యాలీ...

- సత్తుపల్లిలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు విద్యార్థులు...
- ర్యాలీలో అగ్రభాగాన ఎమ్మెల్యే దంపతులు..
- విద్యార్థులపై పోలీస్ లాటి దెబ్బలకి కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే...

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త :






దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు లీకేజీ పై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మంగళవారం శాంతియుతంగా విద్యార్థినీ విద్యార్థులతో ధర్నా చేస్తున్న లోక్సభలో ప్రతిపక్ష నేత ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, పలువురు కాంగ్రెస్ నేతలను విచక్షణ రైతంగా పోలీసులు లాఠీ చార్జీలు ఉపయోగించే అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఏఐసిసి, టీపీసీసీ పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి లో ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు విద్యార్థిని విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి పట్టణ వీధుల్లో మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సత్తుపల్లి జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హాజరు కాగా ర్యాలీకి అగ్ర భాగాన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ నిలవగా కాంగ్రెస్ జెండాలు చేత పట్టి బిజెపి డౌన్ డౌన్ నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని, తదితర నినాదాలతో ప్రధాన రహదారి గుండా వెళ్లి ప్రధాన రింగ్ సెంటర్ వద్ద జరిగిన సమావేశంలో ఢిల్లీలో విద్యార్థిని విద్యార్థులపై, జరిగిన లాటి చార్జీని చూసి ఎమ్మెల్యే కన్నీటిపర్యంతమయ్యారు. యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని విద్యార్థులు తమ హక్కులు కోసం విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం శాంతియుతంగా గొంతు ఎత్తటం ప్రజాస్వామ్య హక్కనిసమస్యలను ప్రశ్నించేవారినిఅణచివేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కేంద్ర ప్రభుత్వం తీరుపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద ఐరుసుకు పడ్డారు. సోనం వాంగ్చుక్ చేపట్టిన ఉద్యమం యువత సేపదుతున్న పోరాటాలు దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడే ఉద్యమాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద విజయకుమార్ అన్నారు. ప్రజల సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ విద్యార్థులు యువతకు అండగా నిలుస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ల పై జరిగిన అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షి చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలుస్తుందని డాక్టర్ దయానంద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రింగ్ సెంటర్ వద్ద దేశ ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ పున్నం సత్యనారాయణకు ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్, మహమ్మద్ రెహానా కమల్ పాషా, బొంతు సుమలత వేణు, ఏంసూరు మండల పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్రెడ్డి,సత్తుపల్లిమండల, పట్టణ, అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, గాదె చెన్నారావు, కౌన్సిలర్లు తోట సుజలా రాణి, ఐరువాడ అపర్ణ నాగభూషణం, మట్ట దేవజ్యోతి, గ్రాండ్ మోలాలి, బండారు శరత్చంద్ర, పలువురు కౌన్సిలర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు వల్లగుండ్ల నరసింహారావు, మహమ్మద్ కమల్ పాషా, పింగళి శామ్యూల్, ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ,విద్యార్థిని విద్యార్థులు వేలాదిగా హాజరైనారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి...

- ఎన్ఎంయులో 36 మంది ఆర్టీసీ ఉద్యోగుల చేరిక...
- ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి మోలానా...

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ( ఆర్టీసీ) నీ ప్రభుత్వంలో విలీనం చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి మోలానా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి కళాభార తిలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ సత్తుపల్లి డిపో కమిటీ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పై విధంగా అన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బస్సులు అధికంగా ఉండటం వలన కొత్తగా ఉద్యోగుల కు రిక్రూట్మెంట్ లేక పోవటం వల్ల ఉన్న ఉద్యోగులపై ఒత్తిడి అధికంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో మహాలక్ష్మి స్కీమ్ అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఉద్యోగులు మానసిక ఒత్తిడి గురవుతున్నారని ఈ సందర్భంగా మోలానా ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల శ్రేయస్ కొరకు నిరంతరం ఉద్యమించే నేషనల్ మజ్దూర్ యూనియన్ను ప్రతి ఒక్కరు ఆదరించాలని ఆయన కోరారు. ఈరోజు సమావేశంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన టీఎంయూ, ఎస్ డబ్ల్యూ ఎఫ్ ,ఐ ఎన్ టి యు సి, ఈ యు, ఇతరయూనియన్లకు సంబంధించిన 36 మంది కార్మికులు స్వచ్ఛందంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ లో చేరటం జరిగిందని వారిని సాదరంగా ఆహ్వానించి సంఘంలో చేర్చుకోవడం జరిగిందని మోలానా ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్యం, కేఎస్ పాల్, సీ ఎన్ కృష్ణ ,ఖమ్మం రీజినల్ సెక్రటరీ ఎల్ ఆర్ కె రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గఫార్, జి బాలస్వామి, పలువురు సంఘ బాధ్యులు హాజరైన వారిలో ఉన్నారు.

# జేవియర్ ప్రభుత్వ కళాశాలలో పెరిగిన విద్యార్థుల చేరికలు....

**సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:** సత్తుపల్లి జేవియర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు 202627 విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ వివిధ గ్రూపులలో 430 మంది కి పైగా విద్యార్థులు చేరటం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాఎన్ గోపి బుధవారం విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో వివిధ గ్రూపుల్లో అడ్మిషన్స్ కొరకు చుట్టుపక్కల ప్రాంతాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి అధ్యాపకులకు కేటాయించడం జరిగిందని అన్నారు. అలా కేటాయించ బడినటువంటి గ్రామాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాల ప్రత్యేకతలను కళాశాలలో ఉన్న గ్రూపులను గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి కళాశాలలో చేరవలసిందిగా కోరడం జరిగింది. ఈ కృషి ఫలితంగా కళాశాలలో ప్రస్తుతం 430కు పైగా విద్యార్థులు చేరడంచాలాసంతోషకరమైనటువంటి విషయమని ఆయన తెలిపారు. ఈ విద్యా సంవత్స రంలో నూతనంగా ప్రవేశపెట్టిన బి ఎఫ్ ఎస్ ఐ కోర్సులో 60 సీట్లు గాను 60 నిండినట్లుఆయనతెలిపారు.అదేవిధంగా ఎంపీసీ గ్రూపులో కూడా 60 సీట్లు నిండినట్లు, కామర్స్ లో 120 సీట్లు నిండినట్లు, బిఏ ఇంగ్లీష్ మీడియం లో 60 సీట్లు నిండినట్లు, ప్రిన్సిపాల్ గోపి తెలియజేశారు. ఈ సందర్భంగా అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొన్న అధ్యాపకులను ఆయన అభినందించారు.

# సర్ 2026 ఎన్నికల సంఘం అధికారిక కార్యక్రమం..

- ఇది ఏ రాజకీయ పార్టీ సొంత కార్యక్రమం కాదు..
- సర్ హెల్ప్ డెస్క్‌ను ప్రజలు వినియోగించుకోండి....
- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు...

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:




భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన సర్2026 ప్రత్యేక ఓటర్ జాబితాకార్యక్రమం రాజ్యాంగబద్ధమైన, ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధికారిక ప్రక్రియ అని, ఇది ఏ రాజకీయ పార్టీ సొంత కార్యక్రమం కాదని రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వర రావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన పత్రికలకు వివరిస్తూప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కునువినియోగించుకునేలా చేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి ఆధ్వర్యంలో సర్2026 హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ హెల్ప్ డెస్క్ ద్వారా కొత్త ఓటరు నమోదు, ఓటరు జాబితాలో పేరు పరిశీలన, పేరు లేదా చిరునామా మార్పు, తప్పుల సవరణ, అవసరమైన దరఖాస్తు ఫారాలు నింపడం, సంబంధిత పత్రాలపై మార్గదర్శకత్వం వంటి సేవలను పూర్తిగా ఉచితంగాఅందిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను నంబూరి తీవ్రంగా ఖండించారు. సర్2026 కేవలం బీజేపీ కార్యక్రమమని, దీని వల్ల బీజేపీకి మాత్రమే లాభం జరుగుతుందని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన అధికారిక కార్యక్రమానికి రాజకీయ రంగు పులమడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని‌అన్నారు.స్వచ్ఛమైన, పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా ఉండటం ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత అవసరమని, అది అన్ని రాజకీయ పార్టీలకూ, ప్రతి పౌరుడికీ సమానంగా ఉపయోగపడే ప్రక్రియ అని తెలిపారు. ప్రజల్లో అపోహలు సృష్టించే బదులు, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకొని అవసరమైన సవరణలు చేసుకునేలా అన్నిరాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు.ప్రజలందరూ ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సమీపంలోని సర్2026 హెల్ప్ డెస్క్‌ను సందర్శించి, తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైతే సవరణలు చేసుకోవాలని,ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నంబూరివిజ్ఞప్తిచేశారు.పట్టణ అధ్యక్షుడు భూక్యా విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బి ఎల్ ఏ 1 పాల నాగ సురేందర్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జోనల్ గద్ద నరేష్ జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిత్రా పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ యాదవ్ మైనారిటీ నాయకుడు ఎస్.కె రహమతుల్లా పట్టణ పట్టణ ప్రధాన కార్యదర్శి నూతల కంటి నాగమోనిక, ప్రముఖదంత వైద్యులు డాక్టర్ నూతల కంటిపెద్దిరాజు, వీరబాబు మెరుగు శేషగిరిరావు పాల్గొన్నారు.

# హాస్పిటల్ లో చీకటి రఘుపతిమ్మని పరామర్శించిన మంత్రి తుమ్మల..

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి రాజకీయ ప్రస్థానంలో కీలక వ్యక్తిగా మండలంలోని తుంబూరు గ్రామానికి చెందిన స్వర్గీయ చీకటి సీతారామయ్య భార్య రఘుపతిమ్మ సత్తుపల్లి లైఫ్ కేర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న



విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల రఘుపతిమ్మని బుధవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబీకులు చీకటి చిట్టి రావు ,చీకటి. రంగారావు లను అడిగితెలుసుకున్నారు. మంత్రి తుమ్మల వెంట పట్టణ ప్రముఖులు ఉన్నారు.

# దాశరథిని స్మరిస్తూ నివాళులు

చిన్నగూడూరు, జూలై 22, ప్రభాతవార్త:



ప్రముఖ తెలంగాణ కవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని బుధవారం చిన్నగూడూరు మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి గ్రామస్తులు దాశరథి సాహిత్య అభిమానులు నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాశరథి తెలంగాణ సాహిత్యానికి ఉద్యమ చైతన్యానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. దాశరధికి నివాళులు అర్పించిన వారిలో దాశరధి సాహిత్య అభిమానులు, గ్రామస్తులు, యువత, పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు దాశరధిని స్మరించుకున్నారు.

# విద్యతో పాటు నైపుణ్యాలు అత్యంత అవసరం

అశ్వారావుపేట రూరల్, జూలై 22 ప్రభాతవార్త: ప్రస్తుత తరుణంలో యువతకు విద్యతో పాటు నైపుణ్యాలు అత్యంత అవసరమని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో ఐటిడిఎభద్రాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన శిక్షణ కేంద్రాన్ని ఐటీడీఏ పిఒ రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే జారె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి కాలంలో కేవలం విద్య ఒక్కటే సరిపోదని, విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం గిరిజన



యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా వందలాది మంది యువతీ యువకులు తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఐటిడిఎ పిఒ రాహుల్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. యువజన శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకుడికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి, నిపుణుల ద్వారా బోధన వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం యువత ఉద్యోగ అవకాశాలను పొందేలా ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం చేసే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ముఖ్యంగా యువతులు ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడేందుకు కుట్టు మిషన్, బ్యూటీషియన్ వంటి కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, లక్ష్మీనారాయణ, మండల అధికారులు, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

అశ్వారావుపేట అర్బన్, జూలై 22 ప్రభాతవార్త: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి లబ్ధిదారుడికి అందేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి





పనులు, వాటి పురోగతిపై శాఖల వారీగా ఆరా తీశారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఐదు మండలాల అధికారులు పాల్గొన్నారు.

## ..వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయండి



తల్లాడ జులై 22: ప్రభాతవార్త

వాతావరణ పరిస్థితుల కను గుణంగా రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా పశుసంవర్ధన శాఖ సంచాలకులు డాక్టర్ బోడెపుడి పురంధర్ విజ్ఞప్తి చేశారు బుధవారం రైతు వేదికలు ప్రజాప్రతినిధులు మండల అధికారులు కార్యదర్శుల కు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కనుగుణంగా అవసరమయ్యే పంటలను మాత్రమే ప్రత్యామ్నాయ పంటలుగా రైతులు ఎంచుకొని సాగు చేయాలని ఎల్ ని నో ప్రభావంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు మిల్లెట్స్ సాగు చేయాలన్నారు ప్రత్యామ్నాయ పంటలు నేపథ్యంలో తాగునీటి సాగునీరు సంరక్షణ తోపాటు పశుగ్రాసం పై దృష్టి సారించాలన్నారు ఈ మేరకు గ్రామాల్లో గ్రామసభలు రైతు సమావేశాలు కరపత్రాలు మైకులు ద్వారా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండి తాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు ఏఈలు అరుణ నవ్య రాయల ప్రసాద్ కృష్ణ కాంత్ శాఖ వైద్యులు డాక్టర్ రాజు ఎంపీ ఓ ఆర్ హరికృష్ణ ఏ పి ఓ సిహెచ్ కోటయ్య సర్పంచులు సుధారాణి బి కాకోజీ శ్రీదేవి రాధాకృష్ణయ్య తల్లాడ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## ..అమ్మవారికి శాకంబరి అలంకరణ..

తల్లాడ జులై 22 :ప్రభాతవార్త



ఆషాడ మాసం ఎనిమిదో రోజు అమ్మవారికి శాకంబరి అలంకరణ ఘనంగా నిర్వహించారు కూరగాయలతో అందంగా తల్లాడకు చెందిన సముద్రాల లక్ష్మీపతిరావు పండరీలు ఏర్పాటు చేశారు ఆలయ కమిటీ చైర్మన్ లగడపాటి నెహ్రూ మాధవిలు పర్యవేక్షించారు

## కేటీఆర్ ని కలిసిన తల్లాడ సర్పంచ్ తనయుడు



తల్లాడ జులై 22 :ప్రభాతవార్త

టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు తనయుడు అయ్యప్ప కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు బుధవారం కేటీఆర్ ఇంటికి వెళ్లి ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి తన అభిమానం చాటుకున్నారు

## రైతులు ఆరుతడి పంటలే వేసుకోవాలి..



కొణిజర్ల జూలై 22ప్రభాత వార్త:

ఎల్నినో కారణంగా రైతులందరూ ముందస్తు అవగాహనతో ఆరుతడి పంటలే వేసుకోవాలని ఏడిఏ కరుణ శ్రీ, తాసిల్దార్ అరుణ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్రయ అధ్యక్షతన. పలు శాఖల ఉన్నతాధికారులు అధికారులతో జరిగిన సమీక్ష సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ..ఎల్నినో ప్రభావంతో ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులదృష్ట్యా , పంటలు పండే అవకాశం లేనందున .. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఎవరికి వారు తమ పొలాల్లో నీటి పంట కుంటలు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలు పెరిగేలా చూసుకోవాలని, అధికారులు గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు 2 గ్రామ సభలు 8 డిపార్ట్మెంట్స్ మండల స్థాయి అధికారుల ద్వారా ఏర్పాటు చేసి రైతులకు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేసినారు . కార్యక్రమంలో వ బాలాజి , ,ఐబి ఇంజనీర్, వెటర్నరీ డాక్టర్స్, విద్యుత్ , నీటిపారుదల శాఖల అధికారులు, ఏపీఓ అమ్మాజాన్ , ఎఎస్ఓ , ఏఈఓ స్ , అధికారులు, సిబ్బంది హాజరైనారు.

## తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారీ

దమ్మపేట రూరల్ జూలై 22 ప్రభాతవార్త :దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుల్లో ఏర్పాటు చేసిన గడుల్లో వేస్తూ వ్యర్థాలను వృథా చేయకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది సేంద్రియ ఎరువు తయరీ పనితీరును సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, వార్డు సభ్యులు పరిశీలించారు. రసాయనిక ఎరువులతో మానవ మనుగడకు ముప్పు ఉందని గ్రహించిన రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి మొగ్గు చూపుతున్నారు. డంపింగ్ యార్డుల్లో స్వచ్ఛమైన ఎరువు తయారీ చేస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, దాసరోజు రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముత్తేశ్వరరావు, పూనెం పోలమ్మ, పంచాయతీ సిబ్బంది బసవయ్య, మహాదేవ సాయి, పారిశుధ్య సిబ్బంది, పగడాల గోపి తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

దమ్మపేట, జూలై 22 ప్రభాతవార్త: మండలంలోని పలువురు లబ్దిదారులకు మంజూరి కాబడిన సిఎంఆరఎఫ్ చెక్కులను అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. మండల కేంద్రం దమ్మపేటతో పాటు లింగాలపల్లి గ్రామంలో పలువురు అనారోగ్య బాధితులకు మంజూరైన చెక్కులను లబ్దిదారులకు తన చేతుల మీదుగా ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సాయంతో పాటు నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సంక్షేమ సహాయం త్వరితగతిన అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల ఆరోగ్య భద్రతకు, అత్యవసర వైద్య పరిస్థితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరట కలిగిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, గ్రామ ప్రజలు లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన తహశీల్దార్

దమ్మపేట, జూలై 22 ప్రభాతవార్త: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మద్దినేని మురళి బుధవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో గండుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో

ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రజలకు పారదర్శక రెవెన్యూ సేవలు అందించడంపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయంతో ముందడుగు వేయాలని సూచించారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

మహబూబాబాద్ టౌన్,జూలై22,ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాస ముట్టడికి పిలుపునివ్వడం, విద్యార్థులను రాజకీయ ఆందోళనల్లోకి తీసుకువచ్చి ఉద్రిక్త పరిస్థితులకు కారణమవుతున్నారనే నేపథ్యంలో రాహుల్ గాంధీ వైఖరిని నిరసిస్తూ మహబూబాబాద్‌లో బీజేపీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేయడం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసనలు శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా జరగాలని, హింసకు లేదా ఉద్రిక్తతలకు దారితీసే చర్యలను ప్రోత్సహించరాదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాచ్వాల్ శ్యామ్ సుందర్‌శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రాంచందర్ రావు, జిల్లా కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.



# ప్రశ్నించే గొంతుకను నొక్కడం అప్రజాస్వామిక చర్య

**-గార్లలో రోడ్డుపై బైఠాయించి**

**నిరసన తెలిపిన ఎమ్మెల్యే**

**గార్ల,జూలై22,ప్రభాతవార్త:**

నీట్ పేపర్ లీకేజీపై యువజన సంఘాలు, విద్యార్థులు చేపట్టిన నిరసనకు మద్దతుగా ప్రజాస్వామిక పద్ధతిలో నిరసన వ్యక్తం చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, లను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్యని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ స్థానిక నెహ్రూ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సొసైటీ చైర్మన్ వడ్ల మూడి దుర్గాప్రసాద్, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ లక్ష్మీ, సర్పంచుల, లతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీతో దేశంలో లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీ ఘటనకు



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించాల్సింది పోయి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను, మద్దతు తెలిపిన ప్రశ్నించే గొంతుకను నొక్కడం సరైనది కాదని అన్నారు. అణిచివేత చర్యలు మానుకొని తక్షణం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు గంగావత్ రాంసింగ్ నాయక్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ పార్వతీ హతీరాంనాయక్, సర్పంచులు రాంసింగ్ నాయక్, వెంకట్రావు, మాజీ జెడ్పీటిసి జాటోత్ ఝాన్సీలక్ష్మి, భూక్య నాశ్వరరావు, ఉప సర్పంచ్ జరీనాబేగం, శివకృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజీవ్‌నాయుడు, మండల నాయకులు కిషన్, యాకూబ్ పాషా, కట్ట శ్రీనివాస్, మల్లిబాబు, పల్లా నరసయ్య, కోల కుమార్ గౌడ్, అశోక్, ఇమ్రాన్ ఖాన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రామవిలాస్ సందులో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన

**-ప్రజా సమస్యలకు**

**అక్కడికక్కడే పరిష్కారం**

**-కమిషనర్ నరేష్‌రెడ్డి సేవలను**

**ప్రశంసించిన స్థానికులు**

**మరిపెడ,జూలై22,ప్రభాతవార్త:**

మరిపెడ మున్సిపాలిటీ 7వ వార్డులోని రామవిలాస్ సందు(చంద్య నాయక్ కాలనీ)లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకోవడంతో పాటు, వార్డు ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు కమిషనర్‌కు తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి వెంటనే



చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తుండటాన్ని స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రామవిలాస్ సందు రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, గతంలో కమిషనర్ నరేష్ రెడ్డి రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారని, అయితే ఆయన బదిలీ కావడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని గుర్తు చేశారు. తిరిగి మరిపెడ మున్సిపాలిటీకి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రామవిలాస్ సందు(చంద్య నాయక్ కాలనీ)లో ఏకంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. అలాగే కమిషనర్ నరేష్ రెడ్డి ప్రతి రోజు ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులను పారిశుధ్య సిబ్బందితో కలిసి స్వయంగా సందర్శిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తుండటం ఆదర్శనీయమని స్థానికులు కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని వార్డు ప్రజలు ప్రశంసించారు.

# ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

**అక్రమ నిల్వలు, నల్లబజారు**

**తరలింపుపై కఠిన చర్యలు**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా**

**కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక**

**ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో**

రైతులకు ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందుబాటులో ఉండేలా అధికారులు, డీలర్లు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. యూరియాను నిర్ణీత ధర కంటే ఎక్కువకు విక్రయించినా, అక్రమంగా నిల్వలు ఉంచి రైతులకు ఇబ్బందులు గురిచేసినా అటువంటి డీలర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, ఇఫ్కో, కోరమాండల్



కంపెనీల ప్రతినిధులు మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా ఫెర్టిలైజర్ హోల్‌సేల్ డీలర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినా సంబంధిత దుకాణాల లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని అధికారులను స్పష్టం చేశారు. యూరియాను ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారు లను ఆదేశించారు .ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయా లను విస్తరించి, రైతులకు సకాల ంలో అందు బాటులో ఉంచాలన్నారు. మండలాల వారీగా ఎరువుల వినియోగంపై పూర్తిస్థాయి నివేదికలు అందించాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఇచ్చే నానో యూరియా వాడకంపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, సహకార అధికారి వాలియా నాయక్, భూపా లపల్లి, మహదే వపూర్ ఏడీఏలు రమేష్, శ్రీపాల్ తదితర అధికా రులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష సమావేశం

**-పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు**

**మహబూబాబాద్,ప్రతినిధి:**



ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు సవరణ, డిజిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందని, తిరిగి బిఎల్వోలకు సమర్పించిన వివరాల ఆధారంగా ఓటరు జాబితా ప్రకారం మ్యాపింగ్ చేసి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని, ఇంకా తమ వివరాలు సమర్పించని ఓటర్లు తమ వివరాలను వెంటనే సంబంధిత అధికారుల దగ్గర, ఆన్లైన్ విధానం ద్వారా కూడా సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు సార్ కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న సర్వే గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, ప్రతినిధులు టిఆర్ఎస్ మారినేని వెంకన్న, కాంగ్రెస్ సురేష్ నాయుడు, బిజెపి శ్యాంసుందర్ శర్మ, టిడిపి బి. రామారావు, సిపిఐ పెరుగు కుమార్, నవీన్, సిపిఎం రాజమౌళి, ఎలక్షన్ సూపరిండెంట్ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగార్థులకు శారీరక పరీక్షలు

**అర్హులకు ఉచిత వసతితో శిక్షణ శిబిరాలు.**

**జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్.**

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త జూలై22:**

రాబోయే పోలీస్ శాఖ నియామకాల కోసం ములుగు జిల్లా నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న ఉచిత వసతితో కూడిన శిక్షణ శిబిరాల ఎంపిక ప్రక్రియలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో అభ్యర్థులకు శారీరక పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఆదేశాల మేరకు ఈ పరీక్షలను అధికారులు నిర్వహించారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శారీరక పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఉచిత వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్.ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న జిల్లా యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సదానందం, ములుగు సీఐ సురేష్, ఆర్ఐలు స్వామి, తిరుపతి, వెంకటనారాయణ, శ్రీకాంత్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



# అమెరికాతో చేసుకున్న వ్యవసాయ ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి

## రైతు సంఘం మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి

గోవిందరావుపేట ప్రభాతవార్త

అమెరికాతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసుకున్న నూతన వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కు అందజేయడం జరిగింది, అనంతరం ఆగిరెడ్డి మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ అమెరికాతో చేసుకున్న వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల ద్వారా దేశంలోని



రైతాంగానికి తీరని నష్టం చేకూరుతుందని అన్నారు. ఒప్పందం ద్వారా అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తులు జీరో టారిఫ్ తో దిగుమతులు చేసుకోవడానికి భారత పార్లమెంటు లో చట్టం తీసుకురావడం జరిగిందని అన్నారు. దేశ రైతాంగానికి నష్టపరిచే చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం అమలు అయినట్లయితేదేశంలో రైతులు పండించే వరి మొక్కజొన్న పత్తి మిర్చి పంటలకు మార్కెట్ ఉండదని అన్నారు. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి చేయడానికి 18 శాతం టారిఫ్ లు విధించాలని తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ రంగం కుదేలవుతుందని రైతు పండించిన పంటకు మార్కెట్ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇలాంటి తప్పుడు చట్టాలను ఉపసంహరించుకోవాలని లేనట్లయితే ఈ ప్రభుత్వానికి రైతాంగం ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు గుండు రామస్వామి మండల కమిటీ సభ్యులు కావ కోటేశ్వరరావు. కట్ట వెంకటేశ్వరరావు, సామ శ్రీనివాస్ రెడ్డి, గుండు లెనిన్ నాలి నరసయ్య, సోలిపురం రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలి

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందించే వసతులు కల్పించాలి

## భోజనం విషయంలో రాజీ వద్దు

మంగపేట జులై22, ప్రభాతవార్త.



రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోకన్న సూచనల మేరకు, మంగపేట మండలంలోని పలు సంక్షేమ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య డీపీవో వెంకటయ్య తో కలిసి సందర్శించారు...మంగపేట మండలంలోని చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, గ్రామాలలో బాలికల హాస్టల్ విద్యాలయాన్ని ఆయన మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయితీ అధికారి కొండా వెంకయ్య, సంబంధిత అధికారులు, స్థానిక చుంచుపల్లి మాజీ ఎంపిటిసి బొచ్చు వెంకన్నతో కలిసి అక్కడ పాఠశాలు హాస్టల్ లలో తనిఖీ నిర్వహించి అందుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆయన బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసి, పరిసరాల పరిశుభ్రతను, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ, హాస్టల్ వార్డెన్లు బాధ్యతా యుతంగా వ్యవహరించాలి అని విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి అని వార్డెన్లు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి వార్డెన్లను ఆదేశించారు. భోజన నాణ్యత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవు" అని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో తదితర అధికారులు పాల్గొన్నారు..

# బురదమయంగా పశు వైద్యశాల రహదారి

## శిథిలావస్థలో వైద్యశాల బిల్డింగ్ మరమ్మతులు చేపట్టా లంటూ పలువురు డిమాండ్

ప్రభాతవార్త ఏటూర్ నాగారం జులై 22:



మండల కేంద్రంలోని పశువైద్యశాలకు వెళ్లే రహదారి బురదమయంగా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుండడంతో విధి లేని పరిస్థితుల్లో ప్రజలు తమ పశువులను వైద్యశాలకు తీసుకొని వస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. మండల కేంద్రంలో నే ఇలాంటి పరిస్థితి నెలకొంటే అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకునే నాధుడే లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైద్యశాల బిల్డింగ్ కూడా శిథిలావస్థకు చేరుకుందని వెంటనే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత రహదారిని ఏర్పాటుచేసి బిల్డింగ్ మరమ్మత్తులు చేపట్టి మెరుగైన సేవలు అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన

## కేంద్ర విద్యా శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌రాజీనామా చేయాలి

వెంకటాపురం, ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టు నిరసనగా బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు, ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇలాంటి చర్యలను వెంటనే విరమించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్యం సునీల్ బాబు, బ్లాక్ అధ్యక్షులు చిడెం శివ, మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, సీతాదేవి, చిట్టెం. సాయి, కె. రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పేపర్ లీక్ కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

## కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ధనపనేని వెంకటేశ్వర్లు

వెంకటాపురం, ప్రభాతవార్త



విద్యార్థుల భవిష్యత్ ను అంధకారం లో నెట్టేస్తున్న కేంద్ర ప్రభుత్వం పై ప్రశ్నించే గొంతుకను అరెస్ట్ చేయడం ప్రజా స్వామ్యాన్ని కూని చేయడమే అన్నారు. నీట్ పేపర్ లీక్ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన, అభద్రతకు కారణం కేంద్ర ప్రభుత్వమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దనపనేని వెంకటేశ్వర్లు విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో నిరంకుశంగా లాఠీ ఛార్జి, అరెస్టు లతో ఆపలేరని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. నిరసనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బలవంతంగా అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని వాపోయారు, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా ఆయన ఖండించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి, పారదర్శక విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకొని దేశ విద్యార్థుల్లో కోల్పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయాలకు అతీతంగా పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థులు, యువత హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు.

# సర్ ప్రక్రియ విజయవంతం

## మల్లంపల్లి తహసీల్దార్ విజయభాస్కర్

మల్లంపల్లి, ప్రభాతవార్త:

మల్లంపల్లి మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయడంతో ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. అర్హులైన ఓటర్ల వివరాలను నిబంధనలకు అనుగుణంగా నమోదు చేయడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన సహకారం వల్ల ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా ముగిసిందని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన సర్పంచులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కరించా లంటూ వినతి

ప్రభాతవార్త ఏటూర్ నాగారం జులై 22:



మండల కేంద్రం లోని 5, మరియు 6 వార్డుల్లో నెలకొన్నడ్రైనేజీసమస్యనుపరిష్కరించాలంటూబీజేపీ మండల అధ్యక్షులు వినుకొళ్ల చక్రవర్తి ఆధ్వర్యంలో ఏటూరునాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందజేశారు దీనిపై సానుకూలంగా స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి త్వరలోనే డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపినట్లు వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్ ,బీజేపీ మండల ఉపాధ్యక్షులు దుర్గం. దుర్గారావు బీజేపీ మండల యూత్ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ యు ఆర్ ఎస్ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

**ఖమ్మం అర్బన్, జులై 22(ప్రభాతవార్త):**

టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఖమ్మం అర్బన్ మండలం వెలుగు మెట్ల కేజీబీవీ,యు ఆర్ ఎస్ ఉపాధ్యాయులతో రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు జిల్లా ట్రెజరర్ వల్లం కొండ రాంబాబు పాల్గొన్నారని ఖమ్మం అర్బన్ మండల ప్రధాన కార్యదర్శి బియ్యని కృష్ణయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేజీబీవీ మరియు యు ఆర్ ఎస్ ఉపాధ్యాయుల కు పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని శ్రమ దోపిడీ జరుగుతుందని,ఇచ్చే అరకొర వేతనం నెలలో ఎప్పుడు వస్తుందో తెలియదని అన్నారు.శ్రమకు తగ్గ టైం స్కేల్ ఇవ్వాలని రెగ్యులర్ చేయాలని రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా సెలవుల్ని ఇవ్వాలని కోరుతూ కేర్ టేకర్ ని నియమించాలని అన్నారు.గత సంవత్సరం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఇచ్చిన మాట ప్రకారం 29 రోజుల సమ్మె కాలానికి జీతం మంజూరు చేయాలని,ఉపాధ్యాయులను బోధనకి పరిమితం చేయాలని,



ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, పిఆర్సి ఇవ్వాలని జీరో వన్ జీరో పద్ధతి ద్వారా జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ మండలం ప్రధాన కార్యదర్శి బియ్యని కృష్ణయ్య కార్యదర్శి విదిత రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు జిల్లా ట్రెజరర్ వల్ల రాంబాబు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి...

**- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..**

**- వచ్చే జూన్ వరకు త్రాగునీటికి సరిపడా నీటి వినియోగంపై కార్యాచరణ సిద్ధం..**

**- రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోంది..**

**- వరి, మిర్చికి బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి..**

**- రూ.175 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన..**

**- వి.వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**రఘునాథపాలెం ప్రభాతవార్త జూన్ 22:**





త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో ఖిసీతారామఖి ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు.ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు.పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్ 2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షి స్తున్నారని తెలిపారు.ఈ ప్రయోగం ద్వారా త్రాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం ఉందన్నారు. అయితే వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిరక్ష ్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇర్రిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు

# ఆరుగురిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**గార్ల,జులై22,ప్రభాతవార్త:**

ఓ వివాహిత మహిళను కులం పేరుతో దూషించిన ఆరుగురు వ్యక్తులపై బుధవారం ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వరంగల్‌కు చెందిన ఓ వివాహిత మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తిని గత రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని కొన్ని రోజులు పాటు కాపురం చేసి, ప్రస్తుతం కాపురం చేయనని చెబుతున్నాడని ఈ విషయమై ప్రశాంత్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు నలుగురుతో, పాటు మరో ఇద్దరు వ్యక్తులు కులం పేరుతో దూషించి వేధించారని వివాహిత దరఖాస్తులో పేర్కొని పోలీస్ స్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) లో అర్హత ఉన్న ప్రతి ఓటరు నమోదయ్యేలా చర్యలు..

**- జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్.**

**- వంద శాతం డిజిటలైజేషన్ కోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలి.**

**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై సమీక్షి ంచిన జిల్లా కలెక్టర్**

**ప్రభాతవార్త కలెక్టరేట్ జూలై 22:**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటర్ డ్రాఫ్ట్ ల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తో కలిసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్వోలు ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు మూడు నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ జాబితాలో ప్రచురిస్తామని తెలిపారు. ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్స్ ఎకరాలు స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 12న శృతి ఓటర్ జాబితాను ప్రచురిస్తామని తెలియజేశారు. జిల్లాల మొత్తం 1460 పోలింగ్ స్టేషన్లను, 12, 43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10,15,693 మంది ఓటర్ల వివరాలలో డిజిటలైజేషన్ చేశామని తెలిపారు. ఇది 81.66 శాతం పురోగదికి సమానమని, ఇంకా 2,28,088 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాల పై ఎన్నికల అధికారులకు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ ఐ ఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారంగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసే లా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ తుది ఓటర్ జాబితాలో స్థానం కల్పించటమే ప్రభుత్వ లక్ష ్యమని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి కావాలంటే ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహకరించాలని కోరారు. బి ఎల్ వో లు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలు అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంత ఎక్కువమంది ఓటర్లు మ్యాపింగ్ పూర్తి అయ్యేలా అందరు కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కానీ ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభవు తుందని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్ డి సి సదానందం, ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ సూపర్డెంట్ ఎంఎ రాజు, డిటి అన్సారి, అధికారులు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నం గోపాలరావు, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు మంకెన రమేష్, కే వెంకటరావు ఆన్ ఆమ్ ఆద్మీ. పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు పి ఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ(ఎం) పార్టీ ప్రతినిధి నెల్లూరు వీరబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో దోపిడి దొంగల బీభత్సం

## కోటికి పైగా సొత్తు అపహరణ 25 లక్షల నగదు

## 54 తులాల బంగారం చోరీ

*కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:*

జిల్లా కేంద్రంలో మరోమారు దోపిడి దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరంలోని భగత్ నగర్ ప్రాంతంలో ముసుగులు ధరించి ఓ ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఇంట్లో వాళ్ళందరిని బంధించి బీరువాలో ఉన్న 25 లక్షల నగదు 54 తులాల బంగారు,30 తులాల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. నగల దుకాణం దోపిడీ ఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. మరోవైపు నగర ప్రజల భద్రత ఈ ఘటనలతో ప్రశ్నార్థకంగా మారింది. భగత్ నగర్ లో చోటు చేసుకున్న ఈ దోపిడీ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

మంగళవారం అర్ధరాత్రి దాదాపు 12.30 గంటల ప్రాంతంలో భగత్ నగర్‌కు చెందిన అజ్మత్ అలీ ఇంట్లోకి సుమారు 8 మంది ముసుగు దొంగలు ఆయుధాలతో చొరబడ్డారు. నాటు తుపాకులు, కత్తులు చూపిస్తూ ఇంట్లోని వృద్ధ దంపతులతో పాటు మహిళలపై దాడికి పాల్పడ్డారు. ప్రతిఘటించేందుకు యత్నించగా, వారి కాళ్లు, చేతులు కట్టేసి, నోటికి గుడ్డలు చుట్టి గదిలో బంధించారు. అనంతరం ఇంట్లోని బీరువాలను తెరిచి సుమారు 54 తులాల బంగారు ఆభరణాలు,30 తులాల వెండి ఆభరణాలు, 25 లక్షల నగదును అపహరించారు. దోపిడీ తర్వాత పారిపోయే క్రమంలో బాధితుల ఇంటి ముందు ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను కూడా తీసుకెళ్లారు.

బాధితుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారుల పర్యవేక్షణలో పోలీసులు, క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దుండగులు పారిపోతున్న సమయంలో ఒక డమ్మీ పిస్టల్ కిందపడిపోగా, దాన్ని క్లూస్ టీమ్ స్వాధీనం చేసుకున్నారు. దొంగలు ఎత్తుకెళ్లిన వాహనాల ఆధారంగా భగత్ నగర్ నుంచి మానేరు బ్రిడ్జి మీదుగా వరంగల్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. ఘటన స్థలాన్ని సిపి గౌస్ ఆలం, డిసిపిలు సందర్శించి బాధితులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపులు ముమ్మరం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానితులను గుర్తించామని వారిపై నేరచరిత్ర ఉన్నట్లు కూడా గుర్తించడం జరిగిందని ఆ కోణంలో దర్యాప్తు జరుపుతున్నామని సిపి గౌస్ ఆలం తెలిపారు.

**ఇంటి దొంగల పనేనా...?**

బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్మత్ అలీ అల్లుడు వ్యాపారంలో నష్టపోయి కరీంనగర్కు వచ్చే స్థిరపడ్డాడని ఇక్కడ కూడా నష్టపోవడంతో తిరిగి వెళ్ళాడు అని తెలిపారు. నిందితులు ఉత్తర భారతదేశానికి చెందిన హిందీ యాసలో మాట్లాడినట్లు బాధితుడు ఇచ్చిన సమాచారంతో నిందితులు మీరట్ ప్రాంతానికి చెందినవారుగా అనుమానిస్తున్నారు. అస్మత్ అలీ ఇచ్చిన సమాచారంతో కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఘటనలో పాల్గొన్న ఎనిమిది మంది ఎవరనే దానిపై సందిగ్ధత వీడటం లేదు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు వరంగల్ వైపు వెళ్ళినట్టు ఆధారాలు లభ్యం కావడంతో అక్కడి నుంచి రైలు ద్వారా పారిపోయి ఉంటారా అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నారు. నిందితులు పారిపోయిన దృశ్యాలు సీసీ కెమెరాల ఆధారంగా లభ్యమైనప్పటికీ ఘటనకు ముందు ఎటువైపు నుంచి వచ్చారనేది లభ్యం కాలేదు. అయితే నిందితులు ఇంట్లోనే ఉన్నారా లేక సమీప ప్రాంతంలో తలదాచుకొని ఘటనకు పాల్పడి ఉంటారా అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు.



# కరీంనగర్‌లో దోపిడి దొంగల మోటార్ సైకిళ్ళు హుజురాబాద్ లో గుర్తింపు

## -- తీవ్రంగా పోలీస్ బృందాల గాలింపు

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ లో బుధవారం అర్ధరాత్రి ఇదే కాలనీకి చెందిన అజ్మాత్ ఆలీ ఇంటిలోకి చొరబడిన 5 దోపిడి దొంగలు ఇంట్లోని వారిని బొమ్మ తుపాకులతో బెదిరించి, గదిలో బంధించి 15 లక్షల రూపాయల నగదు, 65 తులాల బంగారం, కిలో వెండి దోపిడికి పాల్పడిన దొంగలు అక్కడే ఇంటి ముందు పార్కింగ్ చేసిన రెండు మోటార్ సైకిళ్ళ పై పారిపోయిన సంఘటన యావత్ కరీంనగర్ పాత జిల్లా పరిధిలో బుధవారం ఉదయం సంచలనం సృష్టించింది. ఈ సంఘటన పై కరీంనగర్ పోలీస్ కమీషనర్ మహ్మద్ గౌస్ అలం దర్యాప్తు చేస్తున్న తరుణంలోనే కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పి కెనాల్ వద్ద రెండు మోటార్ సైకిళ్ళను గుర్తించిన గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి, సిఐలు జి. కరుణాకర్, శ్రీనివాస్ లు గాలింపు చర్యలు చేపట్టగా కరీంనగర్ నుండి డిసిపి వెంకటరమణ, సిఐ కోటేశ్వర్, పోలీస్ బృందాలతో పాటు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు తీవ్రంగా గాలంపు చర్యలు చేపట్టాయి. కరీంనగర్ లో దోపిడికి పాల్పడిన 5 దొంగలు దోపిడి సొత్తుతో పాటు 2 మోటార్ సైకిళ్ళను దొంగలించి ఈ ప్రాంతంలో వదిలి వెళ్ళడం, దొంగలు ఈ ప్రాంతానికి చెందినవారా..?? లేక పోలీసులను తప్పుదారి పట్టించేందుకు అక్కడి లోకల్ దొంగలే ఈ విధంగా పన్నాగం పొందారా..?? అన్న కోణంలో పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. కరీంనగర్ పట్టణంలోని జ్యూవెల్లరి షాపులో జరిగిన దొంగతనాన్ని మరిచిపోకముందే పట్టణ నడిబొడ్డున ఇంత పెద్ద దొంగతనాన్ని జరగడాన్ని కరీంనగర్ పోలీస్ కమీషనర్ మహ్మద్ గౌస్ అలం తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ దోపిడి ముటాను పట్టుకునేందుకు సిపి గౌస్ అలం 11 పోలీస్ గాలింపు బృందాలను రంగంలోకి దింపారు. హుజురాబాద్ ప్రాంతంలో మోటార్ సైకిళ్ళు లభించడంతో పోలీస్ బృందాలు ఉప్పల్ రైల్వే స్టేషన్, జమ్మికుంట రైల్వే స్టేషన్, బిజిగిరి షరీఫ్ రైల్వే స్టేషన్లతో పాటు ఆర్టీసి బస్టాండ్ లలో ఉన్న సిసి కెమెరాల ఫుటేజీలతో పాటు కరీంనగర్ నుండి హుజురాబాద్ వరకు ఉన్న మానకొండూరు, శంకరపట్నం, హుజురాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సిసి కెమెరాల ఫుటేజీలను పోలీస్ బృందాలను నిషితంగా పరిశీలిస్తున్నాయి. అతి తొందరలోనే దోపిడికి పాల్పడిన 5గురు సభ్యుల ముటాను పట్టుకుంటామని పోలీస్ గాలింపు బృందాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. హుజురాబాద్ ప్రాంతానికి కరీంనగర్ దోపిడికి సంబంధం పై పోలీస్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి.




# ఎంబీబీఎస్ లో మెరిసిన బొంగాని చరిష్మా

## అభినదించిన సర్పంచ్ ఎలుక ఆంజనేయులు

*తిమ్మాపూర్, ప్రభాత వార్త :*

తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన బొంగాని రాజు మంజుల కూతురు బొంగాని చరిష్మా ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గర్వకారణం. ఆమె కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి ఇది గొప్ప ఫలితం ఈ విజయం ఒక్క విద్యార్థినిదే కాదు, మన గ్రామం మొత్తం సాధించిన విజయంగా భావిస్తున్నాం.ఈ సందర్భంగా ఆమెకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను.మన గ్రామంలోని ప్రతి విద్యార్థి ఈ విజయాన్ని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి. గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజల తరఫున ఆమెకు అన్ని విధాలా శుభాకాంక్షలు తెలియజేస్తూ, మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి,వార్డుసభ్యులు బోయిని శంకరయ్య, బావండ్ల ప్రవీణ్, కొర్రి వంశీ, కనపర్తి చంద్రశేఖర్,కుంభం అశోక్, బోయిని సతీష్,మాజీ ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్,మాజీ కో ఆప్షన్ సభ్యులు బిరం మహేశ్వరి నాయకులు బొంగాని రమేష్, గొల్లపెల్లి మల్లేశం,గోనెల రాజు, స్వామి గోలి సంపత్ రెడ్డి, చింతల శ్రీనివాస్ బోయిని శ్రీనివాస్ బోదాసు ప్రవీణ్, అంగన్వాడీ టీచర్స్ ల్యాగల స్వరూప నల్లాల రజిత తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## కరీంనగర్ వార్త

# రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా....

## ఎంపీ కార్యాలయం ముట్టడికి యత్నం...

## చెదరగొట్టిన పోలీసులు...

*.కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:*

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన నిరసనల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేసిన విషయం విదితమే...రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను నిరసిస్తూ కరీంనగర్ ఎంపీ



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజయ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముందుగా సమాచారం అందుకున్న పోలీసులు అప్పటికే ఎంపీ కార్యాలయం వద్ద భారీగా మోహరించారు. ఎంపీ కార్యాలయాన్ని మూసివేయడంతో అప్పటికే అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు గేటు వద్దకు చేరుకోగానే బిజెపి నాయకులు ఎదురుదాడికి దిగారు. కర్రలు, కుర్చీలు విసరడంతో ఆగ్రహించిన కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే క్రమంలో మాటల యుద్ధం కొనసాగిందనీ సమాచారం.. పరిస్థితి అదుపుతప్పుతోందని గ్రహించిన పోలీసులు లాఠీచార్జి చేసి కాంగ్రెస్ నాయకులను చెదరగొట్టినట్లు తెలు స్తోంది.. గాంధీ విగ్రహం వద్ద నిరసనకు బయలుదేరిన డిసిసి అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే సత్య నారాయణ,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వెల్చాల రాజేందర్ రావు, సత్తు మల్లేశంలను పోలీసులు కోర్టు చౌరస్తాలో అడ్డుకొని అరెస్టు చేశారు.

# పట్టపగలే చోరీ వావిలాల పల్లెలో ఘటన సరుకుల కోసం వెళ్లి వచ్చేలోపే రూ. 4 లక్షలు మాయం

*కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:*

నగరంలోని వావిలాలపల్లి తులసి నగర్‌లో బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి నాలుగు లక్షలు అపహరించుకుపోయారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వావిలాల పల్లె లోని తులసి నగర్‌లో నివాసముంటున్న తోట విజయ్ కుమార్ జగిత్యాల ఎస్‌బీఐ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే అద్దెకు వచ్చిన విజయ్ కుమార్ నగరంలో ఇల్లు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే డబ్బులు అందుబాటులో ఉంచుకున్న విజయ్ కుమార్ బుధవారం యధావిధిగా విధులకు హాజరయ్యాడు. అయితే మధ్యాహ్నం 12 గంటల సమయంలో విజయ్ కుమార్ భార్య సౌజన్య ఇంటికి తాళం వేసి నిత్యావసర సరుకుల కోసం సమీపంలోని డిమార్ట్ కు వెళ్లారు. సరుకులు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాల నుండి వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. సౌజన్య ఇచ్చిన సమాచారం మేరకు ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన నాలుగు లక్షల నగదు కనబడడం లేదని పోలీసులకు సమాచారం ఇచ్చింది. బాధితురాలు నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి అనుమానితుల వివరాలు సేకరించారు. విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ తిరుమల్ తెలిపారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్

## -- రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితర సీనియర్ నేతల అరెస్టుకు నిరసనగా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, హనుమాన్ దేవస్థానం చైర్మన్ కొలిపాక శంకర్, ఎండి. కరిమా, కుర్ర శ్రీనివాస్, సుంకరి రాజేందర్, కొత్తగట్టు చక్రపాణి, కొలిపాక సారయ్య, తిప్పారపు భువనచంద్ర, ఇప్పకాయల సాగర్, ములుగు దాదా, చిలకమర్రి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, సాదుల రవీందర్, పోలిశెట్టి వెంకటరాజం, వేల్పుల ప్రభాకర్, టిఎస్ సింగ్, పోగు సమ్మయ్య, శనిగరం భాస్కర్, ఎండి. రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

**-- ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో...**

ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీ చార్జీ చేయడం, ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హుజురాబాద్ లో ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ ల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేపర్ లీకేజీ తో ఎంతో మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం తేటతెల్లమైందన్నారు. లీకేజీ కి బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా విద్యార్థులు నిరసన తెలుపుతుంటే పోలీసులతో లాఠీచార్జి చేయడం, విద్యార్థులకు మద్దతుగా ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పంజాల అరవింద్, ఎన్.ఎస్.యు.ఐ జిల్లా నాయకులు ఉమ్మడి సందీప్, ప్రశాంత్ యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సజ్జు, పసునూటి అన్వేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మేకల రాజ్ కుమార్, చల్లూరి విష్ణువర్ధన్, బాలసాని సుమన్, సందీప్, బంద నవీన్, శనిగరపు తరుణ్, గుండేటి మహేష్, బాబర్, అభిలాష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# హుజురాబాద్‌లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖ ప్రారంభం

## -- హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

స్థానిక ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించే లక్ష్యంతో హుజురాబాద్ పట్టణంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖను ప్రారంభించారు. బుధవారం ఘనంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, బ్యాంక్ జోనల్ హెడ్ ఎం. పిచ్చయ్య విచ్చేసి, బ్రాంచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ ఎం. పిచ్చయ్య మాట్లాడుతూ... పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా... ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించడంలో ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. తెలంగాణలోని వరంగల్ రీజియన్ పరిధిలో ఇది 44వ శాఖ అని ఆయన వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ... ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలకు సులువుగా రుణాలు అందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి ఈ బ్యాంకు తోడ్పడుతుందని, ప్రజల నమ్మకాన్ని చూరగొనేలా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ హెడ్ ఐ. రాజ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త మల్లారెడ్డి, చీఫ్ మేనేజర్ షేక్ అబ్దుల్, బ్రాంచ్ మేనేజర్ మహేష్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

## -- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయవర్ధన్

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హుజురాబాద్ అధ్యక్షులు గంజి జయవర్ధన్ అన్నారు. బుధవారం పెన్షనర్ భవన్ లో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నుండి పెన్షనర్లకు రావలసిన అనేక అంశాలపై అందర్నీ కలుపుకొని వాటి సాధన కోసం ముందుంటానని అన్నారు. పిఆర్సీ విషయంలో గాని డిఏ విషయంలో గానీ, మరే ఇతర సమస్యల కోసమైన రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కోయల్కార్ దుర్గాజీ, ఆర్థిక కార్యదర్శి విజయగిరి, చంద్ర సేన, చింత ఆగయ్య, విష్ణుదాసు గోపాలరావు, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు జయవర్ధన్, కార్యదర్శి దుర్గాజీ, ఆర్థిక కార్యదర్శి చంద్రసేనలను సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తే లైసెన్స్ రద్దు

## రైతులను దోచుకుంటే ఉపేక్షించం

## గూడూరులో ఎరువుల దుకాణంపై అధికారుల సీరియస్ వార్నింగ్

కమలాపూర్: ప్రభాతవార్త:

కల్తీ, అధిక ధరలకు అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేశారు. కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలోని రాజమాత ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంపై బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు దోమా ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి బి. వేణు, వ్యవసాయ విస్తరణ అధికారి బి. ప్రశాంత్ పాల్గొన్నారు. దుకాణంలో ఉన్న ఎరువులు, పురుగుమందుల నిల్వలు, విక్రయ పుస్తకాలు, ధరల జాబితా, కొనుగోలుదారులకు ఇస్తున్న బిల్లులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఉత్పత్తులు సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏడీఏ దోమా ఆదిరెడ్డి డీలర్‌ను హెచ్చరిస్తూ "ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించరాదు. ఒకవేళ అలా చేసినట్లు తెలిస్తే వెంటనే లైసెన్స్ రద్దుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి. ధరల జాబితాను దుకాణం ముందు అందరికీ కనిపించేలా ఉంచాలి. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షి వేది లేదు" అని స్పష్టం చేశారు. అనంతరం రైతులకు సూచనలు చేస్తూ "ఎరువులు, పురుగుమందులు కొనేటప్పుడు బిల్లు తీసుకోవడం మర్చిపోవద్దు. ఏదైనా దుకాణంలో అధిక ధర వసూలు చేస్తే వెంటనే మండల వ్యవసాయ అధికారికి లేదా టోల్ ఫ్రీ నంబర్ కు ఫిర్యాదు చేయండి. కల్తీ ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి" అని కోరారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.




# రాహుల్ గాంధీ అరెస్టుపై కదంతొక్కిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు...

## విద్యార్థులపై లాఠీ ఛార్జ్, కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్.. భారీ ర్యాలీ..

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేపర్ లీకులు చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని, శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసి, విద్యార్థులకు మద్దతుగా లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిలిస్తే అరెస్ట్ చేయడం దుర్మార్గమని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి



సత్యం ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని గాంధీనగర్, కార్ఖానా గడ్డ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, గ్రంథాలయ ఛైర్మెన్ సత్తు మల్లేశం, సుడా మాజీ ఛైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర అధ్యక్షుడు అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి యువత ప్రధాన బలమని చెప్పిన ప్రధాని మోదీ ఆ యువతపై దాడి చేయించడం సమంజసంకాదని, వారి పక్షాన కోట్లాడుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. భేషరతుగా నీట్ ఎగ్జామ్ పేపర్ లేకు సంబంధించి వ్యవహారంపై పార్లమెంట్ లో చర్చ జరగాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అన్నారు. అనంతరం గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీయగా, పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని బీజేపీ అవలంభిస్తున్న తీరుపై వ్యతిరేక నినాదాలు చేశారు. స్థానికంగా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఈ విషయంపై పార్లమెంట్ లో చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్ఎస్వీ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతి నగర్ లో ఉన్న శ్రీ సత్య సాయి మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలను నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు వారికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్వీ నాయకులు చింతల కౌశిక్ శ్రీనివాస్ గురుకుంట్ల మధుకర్ మేకల రవీందర్ శివకుమార్ సన్నీ సంపత్ రమేష్ పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీపై పోలీసు చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

వైరా జులై 22 (ప్రభాతవార్త)

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును వినియోగిస్తున్న ప్రతిపక్ష నాయకులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఢిల్లీలో జరిగిన పోలీసు చర్యను నిరసిస్తూ వైరాలో కాంగ్రెస్ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేపట్టారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకత, నిరుద్యోగ యువత ఆవేదన





వంటి కీలక అంశాలపై సమాధానం కోరడం ప్రతిపక్ష బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై పోలీసు చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే పరిణామమని అన్నారు. . ఈ సమాధానం కోరిన వారిపై కేసులు, అరెస్టులు, అణచివేత చర్యలు చేపట్టడం సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, దాస్ నాయక్ స్పష్టం చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, విద్యార్థి నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీపై జరిగిన పోలీసు చర్యను ఖండించారు.

# నాణ్యత లోపించిన భవన నిర్మాణం స్వల్ప కాలంలోనే దెబ్బతిన్న స్లాబు

## ఊడి పడుతున్న గోడల పెచ్చులు భయాందోళనలో విద్యార్థులు ఉపాధ్యాయులు

కారేపల్లి జులై 22 (ప్రభాతవార్త)

భావిభారత పౌరులైన విద్యార్థుల ప్రయోజనాన్ని ఆశించి కార్పొరేట్ స్థాయికి దీటుగా పాఠశాల భవనాల నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయ్యాయి. అయితే సంబంధిత కాంట్రాక్టర్ పూర్తిచేసిన భవన నిర్మాణం లోప భూయిష్టంగా ఉండడంతో పాటు నాణ్యత లోపించిన విధంగా నిర్మాణం పూర్తయిన 13 సంవత్సరాలకే స్లాబ్ పెచ్చులు ఊడి పడుతూ దినదిన గండంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో పాఠశాల విద్యార్థులు



సిబ్బంది భయాందోళన మధ్య కొనసాగుతున్న తీరుకు నిదర్శనం కారేపల్లి ఆదర్శ పాఠశాల. సింగరేణి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ భవనం ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకుంది. నేడు ఈ పాఠశాలలో సుమారు 700 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. .పాఠశాల ప్రిన్సిపాల్ గదిలో సైతం సంవత్సర కాలంగా స్లాబు పెచ్చులు ఊడి ఇనుప రాడ్స్ కనబడుతున్నాయి. నిర్మాణం ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. 13 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ మోడల్ స్కూల్ భవనం నిర్మాణ నాణ్యతపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. బయటకు చూస్తే భవనం ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, లోపల గోడల్లో పగుళ్లు, ఊడిపోతున్న ప్లాస్టర్, బలహీనమైన నిర్మాణం స్పష్టంగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి భవనానికి తక్షణమే సాంకేతిక పరీక్షలు నిర్వహించి, అవసరమైన మరమత్తులు చేయుటకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రిన్సిపల్ ఎలియట్ ప్రేమ్ కుమార్ వివరణ పాఠశాల భవనముకు పెచ్చులు ఊడి పడుతున్నది వాస్తవమేనని ఈ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ఉద్యాన పంటల సాగు మేలు

రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి

కామేపల్లి, జులై 22 (ప్రభాతవార్త):

వర్షాభావ పరిస్థితులలో రైతులు ఉద్యాన పంటలను సాగు చేయాలని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.కామేపల్లి రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు అవగా హన కార్యక్రమంలో గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున సరైన సమయంలో వర్షాలు పడకపోవడం కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు అయినా పప్పు దినుసులు అపరాలు, కూరగాయలు పండించాలని కోరారు.అనంతరం రైతులకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా సరఫరా చేసిన కూరగాయల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు.సాగులో మెలకువలను వివరించారు.వైరా డివిజన్ ఉద్యాన అధికారి డాక్టర్ ఆకుల వేణు రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్నినో ప్రభావాన్ని వివరిస్తూ కూర గాయల సాగు,ఇతర ఉద్యాన పంటల సాగు ఉత్తమమని తెలిపారు.ఉద్యాన



శాఖ ద్వారా అందిస్తున్న రాయితీ వివరాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి బి. తారాదేవి,విస్తరణ అధికారులు బానోత్ జగదీష్, దీపక్ రెడ్డి, శ్రీకాంత్, లింగాల మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్,రైతులు అజ్మీర రాందాస్ నాయక్, అజ్మీర అర్జున్ నాయక్, ఉప సర్పంచ్ అజ్మీర నాగమణి, భూక్య సీతారాములు, భూక్య లక్ష్మణ్ నాయక్, జరపల గణేష్ నాయక్, జోగ్గూడెం పంచాయతీ కార్యదర్శి వత్సవాయి రవికుమార్, జ్యోతి, జరపల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలి

వైరా టౌన్ జులై 22 (ప్రభాతవార్త)

వైరా రిజర్వాయర్ నుంచి సాగునీటిని తక్షణమే పూర్తిస్థాయిలో విడుదల చేయాలని పలువురు సర్పంచులు జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద ఉన్న ఆయకట్టు ప్రాంతాల్లో 99 శాతం వరి పంటపైనే ఆధారపడి రైతులు జీవనోపాధి కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత సాగు సీజన్‌లో రైతులను ఆదుకునేందుకు వెంటనే కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరారు. గోదావరి జలాలు రిజర్వాయర్‌కు చేరుకోవడం, రిజర్వాయర్‌లో నీటిమట్టం ఆశాజనకంగా ఉండటంతో ఆయకట్టు రైతుల్లో పంటలపై ఆశలు చిగురించాయని తెలిపారు. అయితే ప్రస్తుతం సాగునీటి విడుదల ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్ రెడ్డి, జవ్వాజి అశ్విని, శెట్టిపల్లి శ్రీనివాసరావు, మేదూరి రామారావు, బాలాజీ కృష్ణారావు, మేడ హేమియ చక్రపాణి, ఆళ్ల వెంకటరావు పాల్గొన్నారు.

**కేసుపల్లి వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు..జలాభిషేకం.**

ఏన్కూరు, జులై 22, ప్రభాత వార్త

:వర్షాలు సకాలంలో కురవాలని వేడుకుంటూ.. కేసు పల్లి గ్రామంలో మైసమ్మ..గ్రామదేవతలకు భక్తులు..మహిళలు..ప్రత్యేక పూజలు.. జలాభిషేకాలు నిర్వహించారు. విస్తారంగా వర్షాలు కురవాలని..పంటలు సమృద్ధిగా పండా లని.. పిల్లాపాపలతో సుఖంగాఉండాలని.. నీటి బిందెలను ఊరేగింపుగా గుంపులుగా గ్రామదేవ తల వద్దకు చేరుకున్నారు. మైసమ్మ.. ముత్యా లమ్మ.. పోతురాజు.. బొడ్రాయి వంటి గ్రామదేవతల విగ్రహాలకు నీటితో జలాభిషేకం చేసి.. కొబ్బరికాయలు ప్రత్యేక పూజలు చేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం అప్రజాస్వామ్యం

ఏన్కూరు, జులై 22, ప్రభాత వార్త

:ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ చార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకు లు అన్నారు. ఏన్కూరు ప్రధాన సెంటర్ నందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులో తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ..ఆయని వెంటనే వి దుదల చేయాలని డిమాండ్ చేశారు. .ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ బద్ధమైన హక్కు ఉందని..ఆ హక్కును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోతు లచ్చిరాం నాయక్, కొప్పుల ప్రభావతి రెడ్డి,సామేలు, వేముల కృష్ణ ప్రసాద్, నవీన్, మదన్, మేడా ధర్మారావు నిమ్మల నాగేశ్వర రావు మొగిలి నాగరాజు, ముక్తి వెంకటేశ్వర్లు,వాసిరెడ్డి నాగేశ్వర రావు, మాలోతు నరసింహారా వు,తాళ్లూరి నవీన్,నల్లమల శివకుమార్,పూర్ణ కంటి మైసవరావు,శివ శంకర్ మజీద్ ఖాన్,గు ర్రం రవి, భూక్యా చందూ లాల్ నాయక్,సాగర్, వంతగాని నరేష్,సత్రు నాయక్, పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

కారేపల్లి,జులై 22 (ప్రభాతవార్త)

ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు సంఘీభావంగా నిలిచిన లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు చేయడం రాజ్యాంగ స్ఫూర్తిపైనా, ప్రజాస్వామ్య హక్కులపైనా దాడేనని కాంగ్రెస్ నేతలు అన్నారు. రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా బుధవారం కారేపల్లి క్రాస్ రోడ్డులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు నాయకత్వం లో రోడ్డుపై కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు బైఠాయించి నిరసనలు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి,మోడీ డౌన్ డౌన్అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పెద్ద బోయిన ఉమా శంకర్ రామ్మూర్తి నాయక్ అడ్డగోడ ఐలయ్య,విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ మనియార్, ఈసాల ఛాయాదేవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,మేదరి టోనీ,హనుమంతు, ఆంగోత్ మత్రు,మోతి వీరస్వామి,దండు ప్రవీణ్, హేమలత బాలాజీ,ధరావత్ వెంకటేశ్వర్లు,ఎల్లయ్య తదితర సర్పంచులు, ఎండి యాకూబ్ అలీ,గోపాల్ నాయక్,అనీఫ్,తాజుద్దీన్,భీముడు, మజీద్ పాషా,షఫీ,నరేన్,ఆదేర్ల రాములు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణ పనులను సమీక్షించిన డి ఈ

కారేపల్లి జులై 22 (ప్రభాతవార్త)



సింగరేణి మండలం మాదారం గ్రామంలో వర్షపు నీరు నిలుస్తున్న డ్రైనేజీ ప్రాంతంలో నూతనంగా 19 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ డి ఈ కరుణాకర్ రెడ్డి ఏఈ రాజశేఖర్ పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనుల విషయమై మాజీ సర్పంచ్ అజ్మీర్ నరేష్ నాయక్ తో పాటు గ్రామస్తులతో సమీక్షించారు. కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రహదారి ప్రక్కన ఉన్న డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షాకాలం వచ్చిందంటే మూడు అడుగులకు పైగా వరద నీరు రహదారిపైనే నిలుస్తుంది. దీంతో సమీప కుటుంబాల ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఇటీవల డిప్యూటీ సీఈవో మాదారం పర్యటనకు విచ్చేసి పరిస్థితిని సమీక్షించి ఇచ్చిన నివేదికతో 19 లక్షల రూపాయలు డ్రైనేజీ పనులకు మంజూరయ్యాయి. త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కిలారి వెంకటేశ్వర్లు కాసాని లక్ష్మి నారాయ ణరావుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నైన్ పాక ఎంపీపీ పాఠశాల

**ఎంఈఓ కోడెపాక రఘుపతి**
**నైన్ పాక ఎం పి పి ఎస్ లో**
**కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం**
**హర్షం వ్యక్తం చేస్తున్న**
**విద్యార్థుల తల్లిదండ్రులు**

**చిట్యాల, జూలై 22 (ప్రభాతవార్త):**

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మండలంలో నైన్ పాక ఎంపీపీ పాఠశాల కొనసాగుతుంద ని ఎంఈఓ కోడెపాక రఘుపతి స్పష్టం చేశారు. ఈ మేరకు నైన్ పాక ఎంపీపీ పాఠశాలకు ప్రభుత్వం 4 కంప్యూటర్లను పంపిణీ చేసింది. కంప్యూటర్ ల ల్యాబ్ ను ఎంఈఓ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాము కుంట్ల తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ కోడెపాక రఘుపతి హాజరై మాట్లాడారు. నైన్ పాక ఎంపీపీ పాఠశాల జిల్లాకు ఆదర్శంగా



నిలుస్తుందని తెలిపారు. ఎ క్కడ లేని విధంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఉందని, ఇందుకోసం సహకరించిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందాన్ని ఎంఈఓ అభినందించారు. పాఠశాలలో ఇప్పటికే డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని సైతం ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం సర్పంచ్ నక్క భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాఠశాలను సందర్శించిన నేపథ్యంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలను వివరించడం జరిగిందని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం, సిసి రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో పాఠశాల అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ , ఉపాధ్యాయులు సదానందం, శ్యామ్ సుందర్, ఇ క్రమ్, గవాస్కర్, హసీనా, సి ఆర్ పి తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతురాలు శ్వేత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

**చిట్యాల, జూలై 22 (ప్రభాతవార్త):**



మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన తీర్థాల శ్వేత అనారోగ్యంతో మృతి బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి , ఓదార్చారు. శ్వేత పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీకృష్ణ, మండల, గ్రామ శాఖ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మొగుళ్లపల్లి మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా చదువు అన్నారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**మొగుళ్లపల్లి, జూలై 22, (ప్రభాత వార్త):**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడిగా ములకలపల్లి మాజీ సర్పంచ్ చదువు అన్నారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు పార్టీలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా ఉద్యమ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మిగతా కమిటీ వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి గ్రామ సర్పంచ్ అరెల్లి రమేష్ గౌడ్, మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ బత్తిని శ్రీహరి గౌడ్, మండలంలోని ఆయా గ్రామాల తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు

## మహిళలు, విద్యార్థినీలు భద్రత కోసం అందుబాటులో షీ టీం : ఎస్సై ఫజల్ ఖాన్

**చిట్యాల, జూలై 22 (ప్రభాతవార్త):**

మహిళలు, విద్యార్థినీలు భద్రత కోసం షి టీం నిత్యం అందుబాటులో ఉంటుందని ఎస్సై ఫజల్ ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ఆశ్రమ



పాఠశాల/కళాశాల విద్యార్థినిలకు షి టీం, భరోసా సంయుక్తంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు, జిల్లా షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షి టీమ్ ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, మహిళలపై జరిగే వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ కు స్పందించవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని పేర్కొన్నారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తల్లిదండ్రులు తమ చదువు కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి విద్యపై పూర్తి దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఎలాంటి భద్రతా సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా అసభ్యంగా , అనుచితంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ గోల్కొండ బిక్షపతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, షి టీమ్ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా కన్నుల పండుగగా పెద్దమ్మతల్లి బోనాలు

**గణపురం, జూలై 22, (ప్రభాతవార్త),**



గణపురం మండల కేంద్రంలోని అంగడి ప్రాంగణంలో ఉన్న ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లికి బోనాల పండుగ ముదిరాజ్ కులస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి తొలి ఏకాదశి ముందు పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో శివసత్తుల పూనకాల మధ్య పురవీధుల గుండా ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు సమర్పించారు. గణపురం ముదిరాజ్ కుల పెద్ద పెండ్యాల శీను ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగగా ఈ కార్యక్రమానికి గణపురం సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండి పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నామని అన్నారు అనంతరం సర్పంచ్ ని ముదిరాజ్ మహిళలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు మహిళ సోదరిమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై సమీక్షా సమావేశం

**భూపాలపల్లి, జూలై 22, (ప్రభాతవార్త**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్చార్జి శంకర్ నాయక్ (ఎమ్.ఎల్.సి) సమన్వయకర్త ఎస్.కె హుస్సేన్ తో కలిసి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన పౌరుడు తమ ఓటరు నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు మరియు ఇతర సంబంధిత అంశాల విషయంలో బీఎల్‌ఏలు మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, బూత్ ఇన్చార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**చిట్యాల, జూలై 22 (ప్రభాతవార్త):**

దేశ రాజధాని ఢిల్లీ లో కేంద్ర ప్రభుత్వం లోకసభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ,ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ లను నిర్బంధించడాన్ని ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పేపర్ లీక్ తో 22 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురైనట్లు చెప్పారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లియువతపై పోలీస్ లు విచక్షణ రహితంగా లాటి చార్జీ చేయడం సరైంది కాదన్నారు. ఈ దుర్ఘటన వ్యతిరేకిస్తూ ప్రధాని నివాసం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ జాతీయ నేతలందరినీ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ సర్పంచ్ చిలుకల రాయకొమురు, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ , మాజీ ఎంపీటీసీ గుర్రపు సునీత తిరుపతి, సీనియర్ నాయకులు దబ్బేట రవి, ఆరేపల్లి నర్సింహ రాములు, వార్డ్ సభ్యుడు శనిగరపు మొగిలి, సరిగోముల సదయ్య, యూత్ మండల నాయకులు బొమ్మ కిరణ్, గోల్కొండ నాగరాజు, చిరంజీవి, సుమన్, శివ, ఏకు కిషన్, భాను , రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

**-మరిపెడ పీహెచ్‌సీలో 20 మందికి టీకాలు**

**మరిపెడ, జూలై 22, (ప్రభాతవార్త):**

మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14-15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 20 మంది బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్) నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. చిన్న వయస్సులోనే ఈ టీకా వేయించుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా తమ కుమార్తెలకు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా వేయించాలని సూచించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీకుమారి, ఏఎన్ఎం నాగమణి, ఆశా ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, సునీత, కవిత, వినోదతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొని టీకాల పంపిణీని విజయవంతంగా నిర్వహించారు.

# శహభాష్ పోలీస్..

## -సమయస్ఫూర్తితో యువకుడి ప్రాణాలు కాపాడిన రూరల్ సీఐ

మహబూబాబాద్ టౌన్, జూలై 22, ప్రభాతవార్త:

మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి సమయస్ఫూర్తితో స్పందించి ఆత్మహత్యకు పాల్పడబోతున్న ఒక నిండు ప్రాణాన్ని కాపాడడంతో పట్టణ ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖలో నైట్ అలర్టింగ్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్న రూరల్ సీఐకి బుధవారం తెల్లవారుజామున సుమారు 02:44 గంటలకు డీజీ కంట్రోల్ రూమ్ నుండి ఓ అత్యవసర సమాచారం అందింది. మహబూబాబాద్ రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో, సీఐ అంజలి వెంటనే వైర్‌లెస్ సెట్ ద్వారా పోలీసు సిబ్బందిని



అప్రమత్తం చేయగా తక్షణమే ఎస్సై సుదర్శన్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది ఇతర పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. అయితే షేక్ వసీమ్ ట్రాక్‌పై పడుకుని ఉండడంతో మొదట అతడు ఎవరికీ కనిపించలేదు. ఇదే సమయంలో మణుగూరు ఎక్స్‌ప్రెస్ వేగంగా సమీపిస్తున్న పరిస్థితిలో, పోలీసులు అత్యంత అప్రమత్తంగా వెతుకుతూ చివరకు యువకుడిని గుర్తించి రైలు అత్యంత సమీపానికి చేరుకున్న క్షణాల్లోనే చాకచక్యంగా అతడిని పట్టుకుని రైల్వే పట్టాలపై నుంచి సురక్షితంగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. రక్షించబడిన యువకుడిని షేక్ వసీమ్(26) తండ్రి అబ్బాస్ , నివాసం ఇల్లందుగా గుర్తించారు. అనంతరం అతడిని మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే అతని తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారి సమక్షంలో అప్పగించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ అంజలి మాట్లాడుతూ సమయానికి అందిన సమాచారంపై వెంటనే స్పందించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని క్షేమంగా రక్షించడం పోలీసు శాఖ సేవా తత్పరతకు నిదర్శనమని పేర్కొన్నారు. వ్యక్తిగత, కుటుంబ, మానసిక సమస్యల కారణంగా ఎవరూ ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదని, ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ ఘటనలో మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, ఎస్సై సుదర్శన్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు, సేవా తత్పరత ఒక నిండు ప్రాణాన్ని కాపాడి పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచాయని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అభినందించారు.

# విద్యార్థుల జీవితాలతో కేంద్రప్రభుత్వం చెలగాటం

## -బిజెపిపై మండిపడ్డ జిల్లా డిసిసి అధ్యక్షురాలు ఉమామురళినాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 22, ప్రభాతవార్త:




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని మహబూబాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఉమామురళినాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అరెస్ట్‌కు నిరసనగా ఏఐసిసి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు మేరకు బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం నిలబడ్డ రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్‌నాయకులు వెంకట్‌నాయక్, చిందిరాల జ్ఞానేశ్వర్, ఎం.డి అరుణ్, ఘనపురం అంజయ్య, వెంకటేశ్వర్లు, చరణ్, సత్యమనోరమ, విజయ, లకావత్ పద్మ, రాజు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయాలి

## -కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి

మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త:



పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన, బాధ్యత తను పెంపొందించాలనే లక్ష్యంతో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ నెల 24,25 తేదీల్లో రెండు రోజుల పాటు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమం ను తొర్రూర్ వందేమాతరం ఫౌండేషన్ నితిన్ భవన్ లో నిర్వహించనున్నట్లు కౌన్సిలింగ్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటగా, అనంతరం వారికి యంగ్ ఎర్త్ లీడర్లకు బ్యాడ్జీలను ప్రదానం చేసి పర్యావరణ పరిరక్షణకు నాయకులుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో ఔషధ మొక్కల తోట, కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్‌ల ఏర్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించారని, గత రెండేళ్లుగా ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో కాకతీయ వన చైతన్య యాత్రతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. వాటి కొనసాగింపుగానే భవిష్యత్ తరాలను ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్‌ను చేపట్టినట్లు వివరించారు. ఈ శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం, వాతావరణ మార్పులు, గాలి, నీరు, నేల కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మొక్కల ప్రాధాన్యత, ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత వంటి అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అలాగే నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, బృంద నిర్వహణ నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఎంపికైన యంగ్ ఎర్త్ లీడర్స్ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# ఢిల్లీలో విద్యార్థుల పై లాఠీచార్జి అమానుష చర్య

## -గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కిషన్ నాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 22, ప్రభాతవార్త:

నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలో ధర్నా చేయగా అమాయక విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమైన చర్య అని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం ముందు దళిత గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీక్ బాధ్యులను శిక్షించాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ నిరసన, ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో అనేకసార్లు పరీక్ష పత్రాలు లీక్ చేయడంలో కష్టపడి చదువుకున్న విద్యార్థులు మానసిక వేదనకు సుమారు 20మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని, నీట్ పేపర్ లీకేజి బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆత్మహత్యకు పాల్పడ్డ 20మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో నిరుద్యోగులు విద్యార్థులు లక్షలాదిమంది తమ న్యాయమైన కోరికను శాంతియుతంగా పోరాటం చేస్తుండగా జంతర్ మంతర్ వద్ద పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్ టియర్ గ్యాస్ ప్రయోగించి విద్యార్థుల పైన కనీసం బాలికలు అని చూడకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టడం రక్తం వచ్చేలా కొట్టడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు. జంతర్ మంతర్ వద్ద లక్షలాదిమంది నిరుద్యోగులు విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని తొలగించి విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలేపాక వెంకన్న, బెజ్జం ఐలేష్, పడిశాల వెంకన్న, చేపూరి గణేష్, తేజావత్ వినయ్, ఉపేందర్, సతీష్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# మరిపెడ మున్సిపాలిటీలో నూతన కో ఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకారం

## -పాల్గొన్నఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్

మరిపెడ, జూలై 22, ప్రభాతవార్త:

మరిపెడ పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరశెట్టి శ్రీలత లక్ష్మీనారాయణ, గుండగాని వెంకన్న, షేక్ అజీజ్ పాషా, షేక్ సలీమ్ తాజోద్దీన్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే పట్టణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, పీసీసీ పరిశీలకులు హఫీజ్ ఖాన్, వైస్ ఛైర్‌పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు మెరుగు రాము, జాటోత్ సురేష్, తిరుపతి, కాంతమ్మ కరణ్ సింగ్, లూనావత్ రమేష్, నీలా లచ్చిరామ్, రాములు, గంట్ల గౌతమ్ రెడ్డి, గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి, బోడ భాస్కర్, బేబీ రవి, సత్యవతి యుగంధర్, భద్రమ్మ శ్రీను, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం నూతన కోఆప్షన్ సభ్యులను ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి ప్రభాతవార్త

ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కి ప్రయత్నం చేస్తున్నారని,దుద్దిళ్ల శ్రీధర్‌కు ఎప్పుడు అధికారం వస్తే అప్పుడు ఖాకీ యూనిఫాంలకు అవమానాలేనని, ఇప్పటికే పలుమార్లు చెప్పినా పోలీసుల్లోమార్పు రావడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బుధవారం రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలోని కమాన్ పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీజీ టీవీ అధినేత పూదరి సత్యనారాయణ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం మంట కలిసిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎవ్వరూ రాజ్యాంగాన్ని తెలుసుకుని అభివృద్ధి కావద్దని కక్షయకట్టిని మంథని ఎమ్మెల్యే రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ముందుకు సాగుతున్నాడని విమర్శించారు. ఆనాడు మంత్రిగా ఉన్నప్పుడు తనపై అనేక కేసులు పెట్టించడంతో పాటు చివరకు రౌడీషీట్ ఓపెన్ చేయించిన కీర్తి దుద్దిళ్లకే దక్కుతుందని, ఈనాడు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పూదరి సత్యనారాయణపై ఇప్పటికే 20కేసులు పెట్టించాడని, అనేక ఇబ్బందులకు గురి చేశాడని గుర్తు చేశారు. జూన్ 09న పూదరి సత్యనారాయ ణగౌడ్‌పై ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో కేసు అయితే రామగిరి పోలీసులు పూదరి సత్యనారాయణ ఇంటికి వచ్చారని, ఈ క్రమంలో సత్యనారాయణగౌడ్ తల్లి, భార్య ఎందుకు వచ్చారని అడిగితే ముత్తారంలో కేసు అయింది తీసుకెళ్లమని చెప్పడంతో ముత్తారంలో కేసు అయితే రామగిరి పోలీసులు ఎందుకు వచ్చారని అడిగితే దేశంలో ఎక్కడా లేని విధంగా కేసు పెట్టారని ఆయన అన్నారు. సత్యనారాయణ ను తీసుకెళ్లేందుకు వచ్చిన రామగిరి పోలీసులపై దాడి చేసేందుకు పూదరి తల్లి, తండ్రి, భార్య, పెద్దమ్మ, బావలు కూడగట్టుకుని ఉన్నారని కేసు పెట్టారని, కుటుంబసభ్యులు ఎక్కడైనా కూడగట్టుకుని ఉంటారా అని ప్రశ్నించారు. ఇంట్లో సమస్య వస్తే అందరూ ఒక్క చోటుకు వస్తారే కానీ



అలా వస్తే ఇంత నీచమైన కేసు పెడుతారా అని ప్రశ్నించారు. కేసు పెట్టడంతో పాటు ఆరువై ఏండ్ల పూదరి తల్లిపై దౌర్జన్యం చేసి ఆమెను గాయపర్చారని ఆయన తెలిపారు. జూన్ 9న కేసు అయితే ఈనాటికి 42రోజులు అయిందని సత్యనారాయణను పట్టుకోవడం కోసం ఆరు టీంలు ఏర్పాటు చేశారని, ఒక్కో టీంకు పది మంది పోలీసులు, ముగ్గురు ఎస్ఐలు, ఒక సీఐ ఒక ఏసీపీ ఒక డీసీపీలు 42రోజులు కేవలం సత్తి కోసమే తిరిగిండ్లని ఆయన తెలిపారు.సత్యనారాయణను పట్టుకోవడం లేదని మొన్న రాత్రి డీసీపీని దుద్దిళ్ల నానా దుర్భాషలాడాడని, శ్రీధర్ కోసం పనిచేస్తే కోర్టులో చివాట్లు పడ్డారని ఆయన వివరించారు. ఏం కేసులు పెట్టినవ్ ఏం జ్ఞానం ఉందని హైకోర్టులో జడ్జి హెచ్చరించారని ఆయన తెలిపారు. ఇప్పటికే రామగుండం సీపీకి చెప్పామని, ఐపీఎస్ అధికారిగా జాగ్రత్త పడాలని సూచించినా మార్పు లేదని, ఒక వైపు దుద్దిళ్లతో తిట్లు, మరో వైపు హైకోర్టులో చివాట్లతో ఖాకీ యూనిఫాంకు అవమానాలేనని ఆయన అన్నారు. పూదరి సత్యనారాయణను పట్టుకుంటలేవని రాజును తీసిపడేసిండ్లు వాడుకుని విసిరివడేయడం దుద్దిళ్లకు అలవాటని పోలీసులు గుర్తించాలన్నారు. రాబోయే రోజుల్లోపక్కా అధికారంలోకి రావడం ఖాయమని, ఆనాడు దుద్దిళ్ల హైదరాబాద్‌లో ఉన్నా పూదరికి జరిగినట్లే సేమ్ టూ సేమ్ ట్రీట్ ఇస్తామని, అలాపై ఈ కేసులపై రివ్యూ పెట్టి మరీ తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మీ అరాచకాలు అక్రమ సంపాదనపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా చీకటి పాలన పోవడానికి నా కొడుకుతోని నా కుటుంబం ఉంటమని పూదరి తల్లి బార్య చెప్తున్నారని, నియోజకవర్గంలోని అనేక మంది కుటుంబసభ్యులు ఈ నిర్ణయానికి వస్తున్నారని తెలిపారు.ప్రజలు కోరుకునే అభివృద్ది చేయాలని చెప్పితే పోలీసులతో అణిచివేయాలని చూస్తున్నాడని, అభివృద్దిని పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే దుద్దిళ్ల అని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికి ధన్వాడ స్కూల్‌లో ఒక్క బెంచీ వేయలేదని, .అమెరికాకు పోయి సొంత ఊర్లకు సేవ చేయాలని చెప్పిన దుద్దిళ్ల తన సొంతూరిలో ఏం చేశావో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీని అంతం చేయడానికి నీ చేతులకు మట్టి అంటకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న దుద్దిళ్ల నీచవు బుద్దిని ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల్లో వంద కోట్లు ఖర్చు పెట్టి నా దగ్గర ఏమీ లేవు అంటున్న దుద్దిళ్ల అన్నాదమ్ములు హైదరాబాద్‌లో ప్యాలెస్‌లు కట్టుకున్న విషయాన్ని ప్రజలకు చూపిస్తామన్నారు. ఇప్పటికైనా పోలీసులు మారాల్సి న అవసరం ఉందని, దుద్దిళ్ల అడుగులకు మడుగులు ఒత్తకుండా బానిసలుగా ఉండవద్దని, ఆనాడు పదేండ్లు పోలీసులను గౌరవించామని, కలిసి పని చేశామని ఆయన గుర్తు చేశారు. దుద్దిళ్లతో తిట్టించుకోవడానికి మీరు ఉద్యోగాలు చేయడం లేదనే విషయాన్ని గమనించాలని, రాజ్యంగం మూలంగా మీకు ఉద్యోగాలు వచ్చేయే కానీ దుద్దిళ్ల కుటుంబంతో రాలేదని గ్రహించాలన్నారు. న్యాయబద్దమైన కేసు పెట్టి ఉంటే సత్యనారాయణగౌడ్ నేరుగా స్టేషన్‌కు వచ్చేవాడన్నారు. కాంగ్రెస్ జెండా కప్పుకుని తిరిగిన రాజును ఎక్కడ పడేశాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పదేండ్లు వీళ్ల కోసం మేం పని చేశామా అని అనేక మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధపడుతున్నారని, ప్రజల పక్షాన కొట్లాడితే న్యాయం మన పక్షనే ఉంటదని పూదరి సత్యనారాయ ణగౌడ్ నిరూపించారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జక్కు రాకేష్, శంకేసి రవీందర్, మేదరబోయిన కుమార్ యాదవ్, అత్తే చంద్రమోళి, గుజ్జుల రాజిరెడ్డి, కిషన్ రెడ్డి, గాజుల ప్రసాద్, పుల్లెల కిరణ్, తగరం శంకర్ లాల్, తాడికొండ శంకర్, మేకల సంపత్ యాదవ్, రొడ్డ శ్రీనివాస్, దామెర శ్రీనివాస్, పల్లె నారాయణ, పోలు దాసరి సాయికుమార్ బొంకురి పోశం, సైన్ల సత్యనారాయణ, రేండ్ల కుమార్, ఎండి ఇబ్రహీం, బాసినేని సత్యనారాయణ, పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం భావితరాలకు ఆక్సిజన్ పంచుదాం

రామగిరి ప్రభాతవార్త

మొక్కలు నాటుదాం భావితరాలకు ఆక్సిజన్ పంచుదామని రామగిరి ఎంపీడీఓ బ్రిద.శైలజ రాణి, సర్పంచ్ పల్లె ప్రతిమ పీపీరావు అన్నారు. రామగిరి ఖిల్లాకు వెళ్లే రహదారిలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా ప్రభుత్వం నిర్దేశించిన మొక్కలు నాటాలని వారు కోరారు. ప్రతి ఒక్కరూ వర్షాకాలం సీజన్ లో మొక్కలు నాటడం ఒక ఆనావాయితీగా, అలవాటుగా మార్చుకోవాలని కోరారు. ఖిల్లాకు ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష్యంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రతి



ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమని తెలిపారు. హరితహారం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించే మహత్తర యజ్ఞమని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి చెట్టుగా ఎదిగేలా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మొక్కలు నాటి వాటికి నీరు పోసి, రక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటి వద్ద, ప్రతి సంస్థలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. హరితహారం కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాధ్రపు ప్రవళిక ప్రశాంత్, హార్టికల్చర్ ప్రిన్సిపాల్ ప్రణీత్, సెక్రటరీ గంగుల సంతోష్, వార్డ్ మెంబెర్ కలవెన రవి,టెక్నికల్ అసిస్టెంట్ లింగాల వినోద్,ఫీల్డ్ అసిస్టెంట్ సందేవెన జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

## ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి సమావేశం

రామగిరి ప్రభాతవార్త

రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో బుధవారం జి.యం. కార్యాల యంలో ఏరియా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ యం. రామ్మోహన్, ఎపిఎ ఏరియా ఎస్టోటుజియం బండి సత్య నారాయణ లతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో ఓసీపీ2 లోని 80 టన్నుల క్రేన్ మూడు నెలలుగా బ్రేక్ డౌన్లో ఉండి పనులకు అంతరాయం కలుగుతుందని త్వరగా మరమ్మతులు చేపట్టాలని, ఓసిపి2 మ్యాన్ వే లో ఉన్న కంప్యూటర్ల లకు ఇన్వర్టర్ లను ఏర్పాటు చేయడం, సిహెచ్పి నుండి ఓసిపి1 ఆఫీసుకు వెళ్లే దారి మధ్యలో ఉన్న వే బ్రిడ్జి సమీపంలో రోడ్డును మరమ్మత్తులు చేయడం, వాణి పాఠశాల ముందు నుండి ఎస్టి టు క్వార్టర్స్ కు వెళ్లే దారి పాత సూపర్ బజార్ రోడ్డు ఇరుకుగా ఉంది, దానిని వెడల్పు చేయడం వంటి అనేక సమస్యలు చర్చించారు.

మంథని వార్త



## 25న నాగన్న సంతాప సభను విజయవంతం చేయండి

రామగిరి ప్రభాతవార్త

ఈనెల 25న ప్రజా గాయకుడు, అరుణోదయ నాగన్న సంతాప సభను విజయవంతం చేయాలని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం ఐఎఫ్టియు కార్యాలయం వద్ద పార్టీ,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ల ను ఆవిష్కరించారు. ఈనెల 25 న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నాగన్న సంతాప సభ నిర్వహించడం జరుగుతుందనీ విప్లవ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..ఈ కార్యక్రమం లో కే మోహన్, ఓదెలు, శ్రీనివాస్, కనక లక్ష్మి ,రాధ , ఓదెమ్మ, రాజ్యలక్ష్మి, విజయ, సావిత్రి, ఎం. లక్ష్మి, కే.లక్ష్మి,స్వప్న ,పద్మ , సరోజన, రాజు ,రాజన్న, సంజీవ్ .తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాడెలయ్య బోనాల జాత ర

రామగిరి ప్రభాతవార్త

బేగంపేట గ్రామంలో రజకుల కులదైవం శ్రీ మడేలయ్య స్వామి బోనాల జాతరను బుధవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు .గ్రామంలో రజక వాడ నుంచి భక్తులతో సామూహిక బోనాలతో డబ్బు చప్పులతో ఊరేగింపుగా తరలివెళ్లి ఆలయానికి చేరుకొని బోనాలుసమర్పించారు .రజకులు అందరు కలిసి శ్రీ మడేలయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. మడేలయ్య స్వామి ఆశీస్సులు గ్రామస్తులపై ఉండి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని రజక కులస్తులు వేడుకున్నారు .ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మాదాసి శ్రీనివాస్, మాదాసి బాలేల్లు,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

ముత్తారం, ప్రభాతవార్త:

సీతంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఉప సర్పంచ్ జక్కుల ఓదెలు, 1వ వార్డు సభ్యురాలు జక్కుల వసంత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మీరు మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. వారికి మంత్రి శ్రీధర్ బాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో సీతంపేట గ్రామ ఉప సర్పంచ్ ఇందారపు నవీన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ లు, నాయకులు గంగుల రాయలింగు, ఐరుగురాల రాజమల్లు, కూరాకుల పర్వతాలు యాదవ్, మామిడి సంపత్, బండి శంకర్, లింగం చంద్రయ్య పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముత్తారం, ప్రభాతవార్త:

మైదబండ బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రం తిరుపతి తండ్రి బుచ్చయ్య ఇటీవల మరణించగా, తిరుపతిని, వారి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. తిరుపతి ఇంటికి వెళ్లి బుచ్చయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలం

రామగిరి ప్రభాతవార్త

కొత్త పెన్షన్ ల మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బిజెపి సీనియర్ నాయకుడు ములుమూరు శ్రీనివాస్ అన్నారు. బుధవారం సెంటనరీ కాలనీలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్స రాలు అయినా కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడం విడ్డూరమని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం చాలా బాధాకరమని, వితం తువుగా, ఒంటరి మహిళలుగా మరి కొందరు వృద్దులుగా మారి సంవత్స రాలు గడుస్తున్న వారికి పెన్షన్ మంజూరు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి తప్పిందని అధికారంలోకి రాగానే వృద్ధాప్య పెన్షన్లు 4000 వికలాంగులకు 6000 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు హామీలు నెరవేర్చకపోవడం లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

# ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమర్థవంతమైన రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలని రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారులపై రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతను పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు బీహార్, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రమే సుప్రీంకోర్టుకు అనుసరణ నివేదికలు సమర్పించాయని, మిగిలిన రాష్ట్రాలు కూడా త్వరితగతిన చర్యలు తీసుకొని నివేదికలు పంపాలని సూచించారు. జాతీయ రహదారులపై అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను బలోపేతం చేయడంతో పాటు భారీ వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ స్థలాలను జాతీయ రహదారుల సమీపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల అధికారులు, పోలీసు శాఖ, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పక్కన కొత్తగా మద్యం దుకాణాలకు ఎలాంటి లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని, ఈ ప్రక్రియలో అవసరమైన అన్ని శాఖల సమన్వయం, పోలీసు సహకారం అందేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని అనుసరణ నివేదికలను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రవాణా శాఖ అధికారి సంధాని ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్వో) రోజుకు కనీసం 100 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జూలై 15వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఓటర్ల వివరాలు డిజిటలైజ్ కాగా, గత ఏడు రోజుల్లో కేవలం 22 లక్షల వివరాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని, ఈ పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. వచ్చే సమీక్షా సమావేశం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలనే లక్ష్యంతో అన్ని జిల్లాలు పనిచేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికం మాత్రమేనని, బీఎల్వోలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆధార్ నంబర్ ఇవ్వాలని ఓటర్లపై ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు., ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా బీఎల్వోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం నింపడంలో ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని, ఈ ప్రక్రియపై రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. అధికారులందరూ తమ మొబైల్ నంబర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నవీకరించుకోవాలని సూచించారు. 50 శాతం కంటే తక్కువ డిజిటలైజేషన్ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 80శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా ఈ ఆదివారం లోపు జిల్లాలో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ,లిస్టు తయారు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్. లత, ఆర్డీఓ,లు, మున్సిపల్ కమిషనర్ లు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, డీటీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాల పట్టణంలో సర్ ప్రక్రియ ను 100 శాతం విజయవంతం చేయాలి

## . ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల పట్టణంలో సర్ ప్రక్రియ 100 శాతం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ 7,8,9 వార్డులలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రోగ్రామ్ సరళిని అధికారులు,ప్రజా ప్రతినిధులు తో కలిసి పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి ఓటు ఉండేలా శ్రద్ధ వహించాలి.. ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు వార్డులో శీ।శి కార్యక్రమం పై అవగాహన చేపట్టాలి. అర్హులైన ప్రతి కుటుంబం సర్వేలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. లోకల్ నాన్ లోకల్ ఓటర్ లను త్వరగా గుర్తించాలి. నిర్దేశిత గడువు ముందే పూర్తి చేయడానికి లు కార్యాచరణ చేపట్టాలి అని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ లో తీలీవీ లు సర్ ప్రక్రియ పూర్తి చేసే విదంగా కృషి చేయాలి. రాజకీయాలకు అతీతంగా అందరూ శీ।శి ప్రక్రియ లో పాల్గొనాలి..7,8,9 వార్డులలో 60 శాతం కన్నా తక్కువ సర్ ప్రక్రియ అయింది. అధికారులు వార్డు కి వచ్చినపుడు మనం ఫాం అందజేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గడువు ఇంకా ఉంది అని నిర్లక్ష్యం చేయవద్దు..ప్రతి పౌరుడు విధిగా వారి ఓటు హక్కును రాయించుకోవాల్సి ఉంది. ప్రజాస్వామ్యం లో ఓటు అనేది ఒక ఆయుధం. ఈ కార్యక్రమంలో డి సి సి అధ్యక్షులు గజంగి నందయ్య , కమిషనర్ సత్య ప్రణవ్ ,ఎమ్మార్వో **రామ్మోహన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్,** ౖ సెక్రటరీ బండ శంకర్, మైనార్టీ నాయకులు చాంద్ పాషా కౌన్సిలర్ లు తిరుమలయ్య, కోరుకంటి రాము, హరీష్, పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, చీటి లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, సేవాదళ్ సెక్రటరీ ముకేష్ ఖన్నా, నాయకులు శ్రీనివాస్, ఎల్ జి రమేష్, కైరీ అజయ్ గౌడ్, పంబాల రాము, తొలిప్రేమ శ్రీనివాస్, శ్రీదర్ రావు, సంతోష్ రావు, ప్రవీణ్ రావు, అక్షయ్, క్రిష్ణ రావు, గంగాధర్, మున్సిపల్,ౕ ఒవెన్యూ అధికారులు బి ఎల్ ఓ, బి ఎల్ ఎ లు వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సుదర్శన యాగంలో పాల్గొని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల పట్టణానికి చెందిన వనమాల రాధా కీ.శే.,వనమాల సత్యనారాయణ గారి కుటుంబ సభ్యులు వారి స్వగృహం లో సుదర్శన యాగం నిర్వహించగా సుదర్శన యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య గారు. ఈ కార్యక్రమంలో కొత్త మోహన్, వీరబత్తిని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, మాజీ ఆర్ టి ఏ సభ్యులు సుధాకర్ రావు, సాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లెడ ప్యాక్స్‌లో డబ్ల్యూడీఆర్ఏ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు

**జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:**

జగిత్యాల మండలం రూరల్ కల్లెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సంఘ అధ్యక్షులు అన్నమనేని సందీప్ రావు అధ్యక్షతన వెర్ హౌసింగ్ డెవలప్మెంట్ అథారిటీ చట్టంపై రైతులకు అవగాహన మంగళవారం నిర్వహించారు. మాట్లాడిన అధ్యక్షులు అధికారులు, రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర లభించే వరకు గిడ్డంగుల్లో సురక్షితంగా నిల్వ ఉంచుకునే వెసులుబాటును, వేర్‌హౌస్ రసీదుల ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందే విధానాలను రైతులకు వివరంగా తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఐసిఎం డైరెక్టర్ శ్యామ్ సుందర్, కెడిసిసి జగిత్యాల బ్రాంచ్ మేనేజర్ మార్కండేయ, సహకార సంఘ పాలక వర్గ సభ్యులు, గ్రామ రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**జగిత్యాల టౌన్, ప్రభాత వార్త..**

కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజీ ముకేష్ కన్నా ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఐఆర్ అవగాహన వాల్ పోస్టర్‌ను శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. .ప్రజలందరూ తమ ఓటరు వివరాలను సులభంగా తెలుసుకునేందుకు, ఫోన్ నుండి 1950 నెంబర్‌కు ఖీఈసీఐఖి అని టైప్ చేసి, స్పేస్ ఇచ్చి తమ ఓటర్ ఐడి కార్డు నెంబర్‌ను ఎస్ఎంఎస్ పంపితే వివరాలు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణిశ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, గట్టు సతీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దయల శరత్, కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు దేవనపల్లి రాజేందర్, కార్యదర్శి నాగభూషణం, కార్యదర్శి పులి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల రక్షణకు వినతి.

**జగిత్యాల టౌన్, ప్రభాత వార్త:**

వర్తమాన కాల పరిస్థితుల్లో వయో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రములో నివసిస్తున్న వయో వృద్ధుల రక్షణ కు పటిష్ట వ్యూహం అమలు చేయాలని తమ రాష్ట్ర అధ్యక్షులు పి. నర్సింహా రావు ఆధ్వర్యంలో డీ జీ పి సీ వీ ఆనంద్ కు హైదరాబాద్ లో వినతి పత్రం సమర్పించామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్ తెలిపారు. తల్లి దండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం లోని సెక్షన్ 21(2)(5) ప్రకారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధి లో నివసించే వృద్ధుల ఇళ్లను తరుచుగా సందర్శించాలని, వయోధికుల నుండి ఫిర్యాదు లు అందిన వెంటనే సంబందించిన పోలీస్ అధికారులు తక్షణమే స్పందించేలా తగు ఆదేశాలు జారీ చేయాలని కోరామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథము, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, టాస్క బృందంలో ఉన్నారు.

## ఎల్‌నినో పైరైతన్నలకు విస్తృత అవగాహన..

**. బీర్ పూర్ ప్రభాత వార్త.**

బీర్పూర్ మండల వ్యవసాయ శాఖ అధికారులు ఎం.ఏ.ఓ ఎన్ తిరుపతి ఆధ్వర్యంలో ఏ ఈ ఓ లు గ్రామగ్రామాన తిరుగుతూ ఖిఎల్‌నినోఖి ప్రభావం ,ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతన్నలకు విశేష అవగాహన కల్పిస్తున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఇచ్చే పంటల వైపు రైతులను మళ్లిం,చడానికి తుంగూర్, కోల్వాయి, తాళ్ళ ధర్మారం, గోండుగూడెం తదితర గ్రామాలలో రైతులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. బావుల్లో ఉన్న నీటి లభ్యతను బట్టి మాత్రమే నాట్లు వేయాలని సూచించారు. మిగిలిన భూమిలో కందులు, పెసర్లు, మినుములు, సజ్జలు, జొన్నలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్) మరియు కూరగాయలు సాగు చేయడం ద్వారా లాభాలు పొందవచ్చని వివరించారు. రసాయన ఎరువుల భారాన్ని తగ్గించుకోవడానికి పీ.ఎస్.బి రైజోబియం, ట్రైకోడెర్మా వంటి జీవ ఎరువులను వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలన్నారు.

### భూగర్భ జలాల పెంపు:

నీటి బొట్టును పొదుపు చేస్తూ ఇంకుడు గుంతలు, రీచార్జ్ పిట్‌లను ఏర్పాటు చేసుకోవాలని, దీనికోసం నీటి వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఈ అవగాహన సదస్సులకు అన్ని గ్రామాల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు మరియు రైతన్నలు అధికారుల బాధ్యతాయుతమైన పనితీరును కొనియాడారు. ఈ కార్యక్రమాలలో ఏ.ఈ.ఓ లు అయ్యోరీ వినోద్, వద్లూరి శిరీషలతో పాటు గ్రామ సర్పంచులు అర్షకోట రాజగోపాల్ రావు, రంగు లక్ష్మణ్, చల్ల వినోద, పొర్క దీప కల్పన, ఏ.ఎం.సి డైరెక్టర్ జోగిరెడ్డి, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు. "రైతులకు ఏ కష్టం రాకూడదనే ఉద్దేశంతో ప్రతి గ్రామానికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న బీర్పూర్ వ్యవసాయ అధికారుల పనితీరు ఇతర మండలాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది."

# రోడ్డు భద్రత అందరి బాధ్యత...

## ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేద్దాం...

**కలెక్టర్ చిత్రా మిశ్రా...**

*కరీంనగర్ కలెక్టరేట్ , ప్రభాతవార్త:*

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని.. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రవాణా శాఖ, పోలీస్ శాఖ, ఆర్అండ్ బీ అధికారులు, ఆర్టీసీ, ఎన్ హెచ్ఏఐ పీడీ భరద్వాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రత కమిటీ చైర్ పర్సన్ , కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి, అక్కడ స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వరద నిలిచే రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి.. నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి దెబ్బతిన్న రహదారులకు మరమ్మత్తులు చేయాలని పేర్కొన్నారు. వాహనదారులకు తెలిసేలా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, కల్వర్టులకు పసుపు రంగు వేయించి హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలన్నారు. కరీంనగర్ నగరపాలక పరిధిలో ప్రధాన రహదారులపై లైటింగ్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షి ంచాలన్నారు. అవసరమైన చోట లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు సైతం రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు, రోడ్డు ప్రమాదాల నివారించేందుకు నిఘా, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు , సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్ ఎన్ఫోర్స్మెంట్ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ ప్రక్రియ మొత్తం 60 రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీస్ శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వారి కోసం అందిస్తున్న టోల్ ఫ్రీ నెంబర్ 1033 గురించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడంతోనే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత నెల కంటే ఈసారి రోడ్డు ప్రమాదాలు తగ్గాయని.. హిట్ అండ్ రన్, ఈ చలాన్ కేసుల గురించి వివరించారు. వర్షాకాలంలో వాహనాల మెయింటెనెన్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులకు సీపీ సూచించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ బొమ్మపద్మా నగర్ జంక్షన్, నీరు నిలిచే, ప్రమాదాలు జరిగే ప్రాంతాల గురించి చర్చించారు. పలు ప్రమాదాల కేసులు వివరించారు. అంతకుముందు కరీంనగర్ వరంగల్ జాతీయ రహదారి పనుల గురించి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వివరించారు. సుమారు 95 శాతం వరకు పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# భూసేకరణ పనులువేగవంతంగా చేపట్టాలి..

## అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి..

**కలెక్టర్ చిత్రా మిశ్రా..**

*కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:*

జిల్లాలో చేపట్టిన కీలక సాగునీటి, రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్దీత గడువులోగా సాధించాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ విభాగం, నేషనల్ హైవేస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేర భూసేకరణ పూర్తయింది, ఎంత పెండింగ్‌లో ఉంది, ఎదురవుతున్న సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్-జగిత్యాల ఫోర్‌లేన్ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత సేకరించారు., ఇంకా ఎంత మిగిలి ఉంది, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని వివరాలు తెలుసుకున్నారు. అలాగే కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ భూసేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీలు) నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టుల ప్రభావిత రైతులకు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తికాని ప్రాంతాల్లో వెంటనే సర్వే చేపట్టి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేసి వివాదాలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాసం (ఆర్ అండ్ ఆర్) వంటి అంశాలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. భూములు, ఇళ్లు కోల్పోతున్న రైతులు, ప్రజలకు నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందించి, పునరావాస చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.



## సుప్రీం కోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలి

## రోడ్డు భద్రత చర్యలు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

*జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:*

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేసి, అవసరమైన అన్ని చర్యలను 60 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్ పర్సన్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను వివరించారు. జాతీయ రహదారులపై పార్కింగ్ నిషేధం, ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి వ్యవస్థ ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, హైవే పరిధిలో అనధికార వ్యాపారాల నియంత్రణ, హైవే సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, హైవే సర్వేలెన్స్ పెట్రోలింగ్, అత్యవసర స్పందన వ్యవస్థ, వే సైడ్ అమెనిటీస్ , స్పీడ్ డిటెక్టర్లు, సీసీ కెమెరాలు, సైన్‌బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు, ప్రతి 75 కిలోమీటర్లకు ట్రక్ లేబై సదుపాయాలు, బ్లాక్‌స్పాట్ల అభివృద్ధి, హైమాస్ట్ లైటింగ్, అంతర్‌రాష్ట్ర సమన్వయం, సమగ్ర స్పందన నివేదికలపై సమావేశంలో వివరించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో డిస్ట్రిక్ట్ హైవే సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టులకు పసుపు రంగు గుర్తులు వేయించి ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లపై నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని, వరద ముంపునకు గురయ్యే రహదారులపై ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. గుంతలను వెంటనే పూడ్చి దెబ్బతిన్న రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారులపై లైటింగ్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షి స్తూ అవసరమైన చోట అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. బ్లాక్ స్పాట్ల వద్ద హైమాస్ట్ లైట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీసు శాఖ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను సమీక్షి ంచాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వారి కోసం అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నంబర్-1033పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై నిరంతర అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గత నెలతో పోలిస్తే ఈ నెలలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలిపారు. హిట్ అండ్ రన్ కేసులు, ఈచలాన్ అమలు వివరాలను సమావేశంలో వెల్లడించారు. వర్షాకాలంలో వాహనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాహనదారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆర్!!బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు



# మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం...

**కలెక్టర్ చిత్రా మిశ్రా..**

*కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:*

మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల వారీగా ప్రాజెక్టుల పరిధిలో నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. నెలవారి ప్లాన్ తో పాటు ఏడాది పాటు చేసే కార్యక్రమాలను రూపొందించాలని వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి తనిఖీలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. డీఈవో చైతన్య జైనీ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మాదక ద్రవ్యాల నిరోధక క్లబ్బులు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెంట్ నాగేశ్వరరావు తెలిపారు. డీడబ్ల్యుఓ సరస్వతి మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో వాలంటీర్ల సహాయంతో తరచుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

